హమాస్ లొంగకపోతే గాజా వినాశనమే

ఇజ్రాయిల్

టెల్ అవీవ్: హమాస్ లొంగకపోతే గాజా వినాశనాన్ని ఆపలేరంటూ ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కట్జ్ తేల్చిచెప్పారు. బందీలందరినీ విడుదల చేయల్సిందే అన్నారు. ఇజ్రాయిల్ షరతులతోనే యుద్ధ విరమణ జరుగుతుందని ఆయన శుక్రవారం తేల్చిచెప్పారు. 'యుద్ధం ఆగాలంటే హమాస్ లొంగిపోవాలి. ఆయుధాలు వీడాలి. ఇజ్రాయిల్ షరతులతో రాజీ పడాలి. లేదంటే గాజా విశాసనం తప్పబోదు. హమాస్ హంతకులు, రేపిస్టుల కోసం నరకద్వారాలు తెరుచుకుంటాయి' అని సామాజిక మాధ్యమంలో కట్జ్ హెచ్చరించారు. 'వాళ్లు ఒప్పుకోకపోతే గాజా మరో రఫా, బెయిల్ హనౌన్ (ఇజ్రాయిల్ దురాక్రమణతో శిథిలమైన నగరాలు) అవుతుంది' అని బెదిరించారు. గాజాలో ఉన్న బందీలందరినీ విడిపించే లక్ష్యంగా యుద్ధప్రాతిపదికన చర్చలకు ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆదేశాల నేపథ్యంలో కట్జ్ చేసిన తాజా ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. గాజాపై భీకర భూతల, వైమానిక దాడులతో 60 వేల మంది పలస్తీనియన్ల ప్రాణాలను ఇజ్రాయిల్ హరించింది.

'ఈ రెండు అంశాలు హమాస్‌ను ఓడించాయి. బేషరతుగా బందీలు విడుదలవుతారు' అంటూ నెతన్యాహు ఒక వీడియో ప్రకటన చేశారు. అయితే ఆ అంశాలు ఏమిటో వెల్లడించలేదు. తమ చర్చ తదుపరి దశ గురించీ ఎలాంటి సమావేశం ఇవ్వలేదు. హమాస్ ఇటీవల అంగీకరించిన కాల్పుల విరమణ ప్రతిపాదనపై ఇజ్రాయిల్ స్పందన కోసం మధ్యవర్తులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు గాజా స్వాధీనానికి, పోరు విస్తరణకు ఇజ్రాయిల్ ప్రణాళికలు సిద్ధంచేయడంపై దేశీయంగా, అంతర్జాతీయంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటం తెలిసిందే.

ట్రంప్ ప్రభుత్వానికి కోర్టులో చుక్కెదురు

వాషింగ్టన్: ఫ్లోరిడాలో ఉన్న ఆ నిర్బంధ కేంద్రంలోకి కొత్తగా వలసదారులను తరలించవద్దని ఓ ఫెడరల్ కోర్టు ఆదేశించింది. ఆ కేంద్రాన్ని మూసివేయాలని స్పష్టం చేసింది. దీంతో ట్రంప్ ప్రభుత్వానికి చుక్కెదురైంది. తాజా ఆదేశాలను సవాల్ చేస్తామంటూ ఫ్లోరిడా ప్రభుత్వం పేర్కొంది. అక్రమ వలసదారులపై ట్రంప్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. ఇదే క్రమంలో ఫ్లోరిడాలోని ఎవర్‌గ్లేడ్స్‌లో నిర్బంధ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. మూడు వేల మందిని అక్కడ ఉంటేందుకు టెంట్లు, వైరు బోనులు, బెడ్లు సిద్ధం చేసింది. ఇటీవల అధ్యక్షుడు ట్రంప్ ఈ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కేంద్రానికి 'ఎలిగేటర్ అల్కట్రాజ్' అని పేరు పెట్టడం గమనార్హం. అయితే అమానవీయంగా వలసదారులను బంధించేందుకు ఏర్పాటు చేసిన కేంద్రంగా పేర్కొంటూ పర్యావరణవేత్తలు, ట్రంప్ వలసవాద కార్యాచరణను వ్యతిరేకించే వారు విమర్శలు గుప్పిస్తున్నారు. పర్యావరణ వ్యవస్థకు దెబ్బ అంటూ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై కొందరు కోర్టుకెళ్లారు. సంబంధిత పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. అక్కడ తాత్కాలికంగా నిర్మించిన ఫెన్సింగ్, జనరేటర్లు, చెత్త, మురుగు నిర్వహణ వ్యవస్థలను 60 రోజుల్లోగా తొలగించాలని ఆదేశించింది. కొత్తగా ఎవరినీ నిర్బంధించేందుకు వీల్లేదని స్పష్టంచేసింది.

రెండు వారాల్లో తేల్చాలి: ట్రంప్

వాషింగ్టన్: రష్యా, ఉక్రెయిన్‌లో కాల్పుల విరమణకుగాను శాంతి చర్చల కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో రెండు వారాల గడువు ఇచ్చారు. 'ఈ రెండు వారాల్లో అటో-ఇటో తేలిపోవాలి' అని అన్నారు. న్యూస్‌మ్యాక్స్ అనే వార్తాసంస్థకు ట్రంప్ ఫోన్ ద్వారా ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో ఉక్రెయిన్-రష్యా యుద్ధం గురించి మాట్లాడారు. గడువు ముగిసిన తర్వాత పరిస్థితిని బట్టి కఠిన నిర్ణయాలు తీసుకోవల్సి రావచ్చన్నారు. మరే వివరాలు వెల్లడించారు. ట్రంప్ గత శుక్రవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అలస్కాలో భేటీ అయ్యారు. శాంతి ఒప్పందం ఖరారవుతుందని అంతా భావించారు కానీ ఆ దిశగా చర్చలు ఫలించలేదు. ఇదే క్రమంలో సోమవారం శ్వేతసౌధంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సహా యూరప్ దేశాధినేతలతోనూ ట్రంప్ చర్చలు జరిపారు. దీంతో జెలెన్‌స్కీ, పుతిన్ ప్రత్యక్ష భేటీపై ఆశాభావం వ్యక్తమైంది. కానీ, రష్యాకు యుద్ధ విరమణ ఆలోచనే లేదని జెలెన్‌స్కీ గురువారం ఆరోపించారు. ఆ దిశగా చర్చల అవసరాన్నే నివారించేందుకు రష్యా ప్రయత్నిస్తోందని ఆయన దుయ్యబట్టారు. తాజా పరిణామాల దృష్ట్యా శాంతి చర్చలకు ట్రంప్ రెండు వారాల సమయమివ్వడం ప్రాధాన్యత సంతరించకుంది.

ప్రతిపక్షాలకు భయం

(మొదటిపేజీ తరువాయి)

ప్రయోజనాలను అనుభవిస్తున్నారని మోదీ అన్నారు. ఇటీవల కాలంలో జైలు నుంచే ఫైళ్లపై సంతకాలు చేయడం, ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం చూశామంటూ ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. నాయకుల తీరు ఇలా ఉంటే అవినీతిపై పోరాటం ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు. స్వాతంత్ర్యం తర్వాత 60-65 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో అవినీతి కేసులు లెక్కలేనన్ని ఉన్నాయని, కానీ తమ ప్రభుత్వానికి ఒక్క అవినీతి మరక కూడా అంటలేదని మోదీ అన్నారు. ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. లాంతరు (ఆర్జేడీని ఉద్దేశించి) పాలనలో బీహార్‌లో పరిస్థితి ఎలా ఉండేదో ఓ సారి గుర్తుంచుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ప్రాంతమంతా రెడ్ భయం గుప్పిట్లో ఉండేదని గుర్తు చేశారు. ఆర్జేడీ పాలనలో గయా జీ వంటి నగరంతో పాటు రాష్ట్రం మొత్తాన్ని అంధకారంలో నెట్టారని ఆరోపించారు. లాంతర్ పాలనలో సాయంత్రం ఎక్కడికైనా వెళ్లడం కష్టమయ్యేదని ఎద్దేవా చేశారు. విద్యుత్ స్తంభాలు కూడా లేని వేలాది గ్రామాలు ఉండేవన్నారు. విద్య, సరైన ఉపాధి లేక బీహారీలు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లాల్సి వచ్చేదని విమర్శించారు. కాంగ్రెస్, ఆర్జేడీ ప్రభుత్వాలు ప్రజాధనం విలువను ఎన్నడూ గుర్తించలేదని, తమ ఖజానాలు నింపుకోవడానికే దాన్ని ఉపయోగించాయని ఆరోపించారు. అందుకే వారి హయాంలో ప్రాజెక్టులు ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉండేవని, ప్రాజెక్టు ఆలస్యమయ్యే కొద్దీ దాని నుంచి డబ్బులు దండుకునేవారని ప్రధాని మోదీ తీవ్రంగా విమర్శించారు.

కోల్‌కతాలో మూడు కొత్త మెట్రో రైలు మార్గాలు

పశ్చిమబెంగాల్‌లోనూ పర్యటించిన ప్రధాని మోదీ కోల్‌కతాలో మూడు కొత్త మెట్రో రైలు మార్గాలను జెండా ఊపి ప్రారంభించారు. వీటిలో ఒకటి నేరుగా కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి దారితీసే మార్గం కూడా ఉంది. ప్రధానితో పాటు పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య, కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ ఉన్నారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఈ కార్యక్రమాలకు హాజరు కాలేదు.

సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాట్లు చేపట్టింది. మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ గత నెల రోజుల నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్వర్యంలో కళా కారులు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కళా జాతాలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేపట్టారు. శనివారం సాయంత్రం 3 గంటలకు ఒంగోలులో స్థానిక నెల్లూరు బస్టాండ్ నుండి ఆర్టీసి బస్టాండ్ సమీపంలోని కొత్త కూరగాయల మార్కెట్ వరకు 25 వేల మందితో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలైన నేపథ్యంలో జరుగుతున్న ఈ మహాసభలను ఆహ్వానసంఘం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ వందేళ్లలో పేద, బడుగు, బలహీన, కార్మిక, కర్షక, ఉద్యోగ, శ్రామికవర్గాల కోసం చేసిన పోరాటాలు స్ఫూర్తి దాయకంగా నిలుస్తాయి. నేటికీ పేద వర్గాల కోసం , సమాజ అభివృద్ధి కోసం అసమానతలు, అంటరానితనానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు చేస్తోంది. ఈ తరుణంలో పోరాటాలకు పురిటిగడ్డగా ఉన్న ఒంగోలు మహానగరంలో మొట్టమొదటి సారి జరుగుతున్న సీపీఐ రాష్ట్ర మహాసభల జయప్రదానికి జిల్లా పార్టీ నాయకత్వం ప్రచార కార్యక్రమాలతో పాటు విస్తృత ఏర్పాట్లను చేపట్టింది. ఎక్కడికక్కడ భారీ హెూర్డింగులు, లెనిన్, భగత్‌సింగ్ విగ్రహాలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రజా పోరాటాలను ప్రతిబింబించే విధంగా ఫోటో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎర్రజెండా చేతపట్టి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీరికి తోడు ప్రజా నాట్యమండలి కళాకారులు గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న కళాజాతాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. గత రెండు రోజుల నుంచి ప్రజా నాట్యమండలి అధ్వర్యంలో ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూమ్‌లో ఏర్పాటు చేస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రనాయక్, పెంచలయ్య, రామకృష్ణ దగ్గరుండి కళా ప్రదర్శలను చేయిస్తుండగా మరో పక్క సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి జీ ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, ఆహ్వానసంఘం అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు, ఆహ్వానసంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్ వెంకట్రావు ఏర్పాట్లను స్వయంగా పరిశీలిస్తున్నారు. శనివారం జరిగే బహిరంగసభకు సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి కే నారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణ మూర్తి, ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనజ తదితరులు హాజరై ప్రసంగించనున్నారు.

సభాస్థలికి ర్యాలీ కొనసాగేదిలా...

రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని వేలాదిమంది సీపీఐ శ్రేణులతో జరిగే భారీ ర్యాలీ మధ్యాహ్నం 3 గంటలకు నెల్లూరు బస్టాండ్ వద్ద గల మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ నుండి ప్రారంభమై కలెక్టరేట్, చర్చి సెంటర్, ట్రంకు రోడ్, మస్తాన్ దర్గా సెంటర్, పాత కూరగాయల మార్కెట్, అద్దంకి బస్టాండ్, కర్నూల్ రోడ్డు మీదుగా, ఆర్టీసీ బస్టాండ్, కొత్త కూరగాయల మార్కెట్ రోడ్డు గుండా ఊర చెరువులోని నూతనంగా ఏర్పాటు చేసిన సభాస్థలి వరకు సాగుతుంది. బహిరంగ సభ సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమవుతుంది. సభాస్థలికి కామ్రేడ్ గుజ్జుల యల్లమందారెడ్డి, సరళా దేవి సభా ప్రాంగణంగా నామకరణం చేశారు. అలాగే రాష్ట్ర మహాసభలు సంఘమిత్ర హాస్పిటల్ సమీపంలోని ఏర్పాటుచేసిన కామ్రేడ్ నల్లూరి అంజయ్య ప్రాంగణంలోని, కామ్రేడ్ పూల సుబ్బయ్య హాలులో నిర్వహించనున్నారు.

ర్యాలీలో పాల్గొనే వారికి విజ్ఞప్తి...

ర్యాలీలో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుండి హాజరయ్యే పార్టీ శ్రేణులు, కార్మికులు, శ్రమజీవులు, యువత, విద్యార్థులు, మహిళలు, ప్రజల కోసం నెల్లూరు బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ వద్ద ఉదయం 11 గంటల నుండి భోజనం ఏర్పాట్లు చేయడం జరిగింది. ర్యాలీ కచ్చితంగా మధ్యాహ్నం 3 గంటల నుండి నెల్లూరు బస్టాండ్ నుండి ప్రారంభమవుతుంది. ర్యాలీలో పాల్గొనేవారు మగవారు ఎర్ర టీ షర్టులు, మహిళలు ఎర్ర చీరలను ధరించి హాజరు కావాల్సి ఉంటుంది. డప్పు కళాకారులు వారికి కేటాయించిన దుస్తులలో ప్రదర్శనలో పాల్గొనాలి. జనసేవ దళ్ వాలంటీర్లు వారి ఇన్‌స్ట్రక్టర్ల సూచనల మేరకు కవాతు నిర్వహించాలి. వివిధ ప్రాంతాల నుండి వాహనాలలో వచ్చే వారు వారి వాహనాలను దక్షిణ బైపాస్ సమీపంలోని మినీ స్టేడియంలో నిలుపుకోవాల్సిందిగా నిర్వాహకులు సూచించారు.

లార్డ్ స్వరాజ్ పాల్ మృతి

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చిన మద్దతుగాను లార్డ్ పాల్‌ను భారత్ ఎప్పటికీ మరువలేదన్నారు. ప్రజా సేవతో, దాతృత్వంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని, పారిశ్రామికవత్తేగా రాణించారని, భారత్-బ్రిటన్ బంధానికి ఎంతగానో తోడ్పడ్డారని, ఆయన చిరస్మరణీయుడని తన సంతాప సందేశంలో మోదీ పేర్కొన్నారు. స్వరాజ్ పాల్ 1931, ఫిబ్రవరి 18న జన్మించారు. పంజాబ్, జలంధర్‌లో పాఠశాల విద్యను పూర్తి చేసుకున్న ఆయన 1949లో పంజాబ్ యూనివర్సిటీ నుంచి బీఎస్‌సీ చేశారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లారు. మాసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్స్ & మాస్టర్స్ డిగ్రీలు పొందారు. అనంతరం భారత్‌కు తిరిగి వచ్చి తమ కుటుంబ వ్యాపారం అపీజే సురేంద్ర గ్రూపు చేపట్టారు. లుకేమియాతో బాధపడే తన కుమార్తె అంబికా చికిత్స కోసం 1966లో బ్రిటన్‌కు వెళ్లారు. నాలుగేళ్ల అంబికా మరణానంతరం అంబికా పాల్ ఫౌండేషన్ అనే చారిటబుల్ ట్రస్టును లండన్‌లో ఏర్పాటు చేసి, ప్రపంచ వ్యాప్తంగా అవసరార్థ పిల్లలకు విద్య, ఆరోగ్య సేవలు అందించడంలో తోడ్పడ్డారు. తన కుమార్తె జూకు వెళ్లినప్పుడు చాలా ఆనందంగా ఉండేదన్న కారణంగా అంబికా ఫౌండేషన్ అధ్వర్యంలో అంబికా పాల్ చిల్డ్రన్ జూను లండన్‌లో ఏర్పాటు చేశారు. 2015లో కుమారుడు అంగద్‌ను కోల్పోయారు. 2022లో భార్య అరుణ మరణించారు. దీంతో లార్డ్ పాల్ మరింతగా దానధర్మాలు చేశారు. తన భార్య పేరు మీద 2023 ఫిబ్రవరిలో లండన్‌లోని చారిత్రక ఇండియన్ జింఖానా క్లబ్‌లో లేడి అరుణ స్వరాజ్ పాల్ హాల్‌ను ప్రారంభించారు. ఆ సందర్భంగా తన భార్యను స్మరించుకున్న పాల్... మా 65ఏళ్ల వివాహ జీవితంలో ఎన్నడూ గొడవ పడలేదన్నారు. కాగా, ఏటా విడుదలయ్యే 'సండే టైమ్స్ రిచ్ లిస్ట్'-2025లో 81వ స్థానంలో స్వరాజ్ పాల్ నిలిచారు. లండన్ కేంద్రంగా కపారో సంస్థ ప్రపంచ వ్యాప్తంగా 40 చోట్ల కార్యకలాపాలు సాగిస్తోంది. బ్రిటన్, ఉత్తర అమెరికా, భారత్, మధ్యాసియాలోనూ కార్యాలయాలున్నాయి. లార్డ్ పాల్ కుమారుడు ఆకాశ్ పాల్ ప్రస్తుతం కపారో ఇండియా చైర్మన్‌గా, కపారో గ్రూపు డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. లార్డ్ స్వరాజ్ పాల్‌ను బ్రిటిష్ మహారాణి 1978లో నైట్‌హుడ్‌తో సత్కరించారు. లార్డ్ పాల్ ఆఫ్ మేరీలేబోనే బిరుదును ఆయన పొందారు. బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యులు అయ్యారు. విదేశీ విధాన కేంద్రం సలహా మండలి సభ్యుడిగా వ్యవహరించారు. 1998 నుంచి 2010 వరకు బ్రిటిష్ బిజినెస్ ఫోరం రాయబారిగా పనిచేశారు. 2000 నుంచి 2005 వరకు ఇండో-బ్రిటిష్ రౌండ్ టేబుల్ సదస్సు సహ-చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. బ్రిటన్, అమెరికా, స్విట్జర్లాండ్, రష్యా యూనివర్సిటీల నుంచి మొత్తం 15 గౌరవ డిగ్రీలు అందుకున్నారు. భారత ప్రభుత్వం ఆయనను పద్మ భూషణ్, భారత్ గౌరవ్ అవార్డులతో సన్మానించింది.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శులుగా తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఇ.టి.నర్సింహా ఎన్నికయ్యారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్'(గాజుల రామారం)లో జరిగిన సీపీఐ రాష్ట్ర నాలుగవ మహాసభ చివరి రోజు శుక్రవారం నూతన నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. పది మంది కార్యదర్శివర్గ సభ్యులు, 32 మంది కార్యవర్గ సభ్యులు సహా మొత్తం 101 మందితో నూతన రాష్ట్ర సమితి ఎన్నికైంది. రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని పేరును సీపీఐ సీనియర్ నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి ప్రతిపాదించగా, కలవేన శంకర్ బలపర్చారు. ఈ ప్రతిపాదనకు రాష్ట్ర సమితి ఏక్రగీవంగా ఆమోదం తెలియజేసింది. అలాగే రాష్ట్ర సమితికి క్యాండి డేట్ సభ్యులు, ఆహ్వానితులను, రాష్ట్ర కార్యవర్గానికి ఆహ్వానితులను కూడా ఎన్నుకున్నారు. నూతన నాయకత్వాన్ని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా అభినందించారు. రాష్ట్రంలో సీపీఐని మరింత బలోపేతం చేస్తూ ముందుకు తీసుకెళ్లాలని వారికి దిశానిర్దేశం చేశారు.

సీపీఐ నూతన రాష్ట్ర సమితి సభ్యులు :

కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, పల్లా వెంకట్‌రెడ్డి, తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, బాగం హేమంతరావు, కలవేణ శంకర్, ఎం.బాలనరసింహా, ఇ.టి.నరసింహా, వీఎస్.బోస్, ఎన్.జ్యోతి, వి.సృజన, ఎస్.బాల్‌రాజ్, ఎం.డి.యూసుఫ్, కలకొండ కాంతయ్య, సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర, కె.మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్, వి.సీతారామయ్య, బొమ్మగాని ప్రభాకర్, బి.ఎస్.ఆర్.మోహన్‌రెడ్డి, ఎన్.మధుకర్, రమావత్ అంజయ్య నాయక్, పల్లె నర్సింహా, కె.శ్రీనివాస్ రెడ్డి, కె.ధనుంజయనాయుడు, మారపాక అనిల్‌కుమార్

ఓటు నమోదుకు ఆధార్

(మొదటిపేజీ తరువాయి)

అంగీకరించాలని కోర్టు బీఎల్‌ఓలను ఆదేశించింది. విచారణ సందర్భంగా భారత ఎన్నికల కమిషన్ తరఫున సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది వాదనలు వినిపించారు. ఆగస్టు 14న కోర్టు ఆదేశించిన విధంగా ముసాయిదా జాబితా నుండి తొలగించబడిన ఓటర్ల జాబితా, మినహాయింపులకు గల కారణాలతో సహా వెబ్‌సైట్‌లు, పోలింగ్ బూత్‌లలో ప్రచురించబడిందని తెలిపారు. సమ్మతి అఫిడవిట్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. జాబితాలను రాజకీయ పార్టీల బీఎల్‌ఏలకు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. "ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ కూడా (తొలగింపుకు) ఒక్క అభ్యంతరం కూడా దాఖలు చేయలేదు" అని ద్వివేది స్పష్టం చేశారు. ఏ రాజకీయ పార్టీ కూడా కోర్టు ముందుకు రాలేదని ద్వివేది చెప్పినప్పుడు, సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబాల్, డాక్టర్ ఏఎం సింఘ్వి తప్పుబట్టారు. బీహార్‌లోని ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఆర్జేడీ నుండి ఎంపీ మనోజ్ ఝా తరఫున తాను ప్రాతినిధ్యం వహిస్తున్నానని సిబల్ చెప్పారు. ఐఎన్‌సి, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, సీపీఐ, ఎన్‌సీపీ ప్రతినిధులు సంయుక్తంగా దాఖలు చేసిన పిటిషన్ తరఫున తాను కోర్టుకు హాజరవుతున్నానని సింఘ్వి చెప్పారు. జాబితాలో చేర్చడానికి కొత్త ఓటర్లు 2 లక్షలకు పైగా ఫారాలను దాఖలు చేశారని ద్వివేది పేర్కొన్నారు. రాష్ట్రంలోని 12 గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలలో ఏవీ ఎటువంటి అభ్యంతరాలు తెలియజేయలేదని... వారు తమ రాజకీయ ప్రయోజనాల కోసం భయాన్ని రెచ్చగొడుతున్నారని ఆయన ఆరోపించారు. ఎస్‌ఐఆర్‌ను పూర్తి చేయడంలో ఎన్నికల కమిషన్‌కు సహాయం చేయడం రాజకీయ పార్టీల విధి అయినప్పటికీ సహకరించడం లేదని ద్వివేది అన్నారు. కాగా, చాలా మంది ప్రజలు రాష్ట్రం వెలుపల వలస కార్మికులుగా పనిచేస్తున్నారని, వారు ఫారంలను దాఖలు చేయలేకపోవచ్చునని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ తరఫున హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అన్నారు. అలాగే, అన్ని నియోజకవర్గాలలో అన్ని రాజకీయ పార్టీలకు బూత్ లెవల్ ఏజెంట్లు లేరని తెలిపారు. "అతిపెద్ద ప్రతిపక్ష పార్టీఆర్జేడీ. వారికి సగం నియోజకవర్గాలలో మాత్రమే బీఎల్‌ఏలు ఉన్నారు" అని భూషణ్ అన్నారు. దీంతో ఏ ఓటరు అయినా వారి ఆధార్ కార్డుతో పాటు ఆన్‌లైన్‌లో ఓటుకోసం ఫారం సమర్పించవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీం తీర్పు నేపథ్యంలో బీహార్‌లో మాత్రమే కాక వచ్చే ఎన్నికల్లో ఆధార్ కీలకంగా మారిందని భావించొచ్చు.

ఏం జరిగింది?

బీహార్‌లో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను సవరిస్తోంది. ఈ ప్రక్రియలో భాగంగా జాబితా నుంచి తొలగించబడిన వారి పేర్లను తిరిగి చేర్చడానికి ఆధార్ కాకుండా ఇతర 11 పత్రాలను మాత్రమే సమర్పించాలని ఈసీ సూచించింది. దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఆగస్టు 18న ఈసీ విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి సుమారు 65 లక్షల మంది పేర్లు తొలగింపునకు గురయ్యాయి. "తొలగింపునకు గురైన ఓటర్ల నుంచి ఆధార్ కార్డు లేదా ఇతర ఆమోదయోగ్యమైన పత్రాలతో ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులు స్వీకరించడానికి అనుమతిస్తాం" అని తాజాగా సుప్రీంకోర్టు పేర్కొంది. భౌతికంగా దరఖాస్తు చేసుకోవడంతో పాటు ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవడానికి ఓటర్లకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది.

రాజకీయ పార్టీలపై అసహనం

ఓటర్ల జాబితా నుంచి పేర్లను సరిచేయడానికి ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా ముందుకు రాకపోవడం పట్ల సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్ఏలు 1.6 లక్షల మంది ఉన్నప్పటికీ వారి నుంచి కేవలం రెండు అభ్యంతరాలు మాత్రమే దాఖలు కావడమేమిటని ప్రశ్నించింది. అయితే బీఎల్ఏలు ఇచ్చిన అభ్యంతరాలను అధికారులు అంగీకరించడం లేదని కొన్ని పార్టీలు వాదించాయి. ఎస్‌ఐఆర్‌లో 85,000 మంది కొత్త ఓటర్లు నమోదు చేసుకున్నారన్న ఈసీ వాదనను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది.

అసలు సమస్య ఏంటంటే?

బీహార్‌లో ఎన్నికలు నిర్వహించడానికి ముందు ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించిన విషయంపై సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లలో ముఖ్యంగా పేర్లు తొలగించడం పట్ల ఎలాంటి స్పష్టత లేదా సమర్థత లేదన్న ఆరోపణలు ఉన్నాయి.కాగా బీహార్‌లో ప్రతిపక్ష పార్టీలు ఈసీ చేపట్టిన ఎస్‌ఐఆర్ ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేశాయి. సరైన ధృవీకరణ లేకుండా అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని ఆరోపించాయి.

షాంఘై సదస్సుకు మోదీ, పుతిన్

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించారు. 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిని పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గతేడాది రష్యాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడితో ప్రధాని మోదీ భేటీ అయ్యారు.

సాస్కి కింద రూ.5 వేల కోట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మూలధన ప్రాజెక్టుల కోసం సాస్కి కింద అదనంగా రూ.5,000 కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ వెళ్లిన సీఎం చంద్రబాబు శుక్రవారం నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపట్టే అనేక అభివృద్ధి కార్యక్రమాలను ఆమెకు వివరించారు. ఈ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయడానికి ఆర్థిక సహాయం అందించవలసిందిగా కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటివరకు ప్రత్యేక మూలధన పెట్టుబడి సహాయం పథకం కింద రూ.2,010 కోట్లు లభించాయని తెలిపారు.

నాడు రాజీవ్... నేడు రాహుల్

(మొదటిపేజీ తరువాయి)

గాంధీ కూర్చుని మౌలానాతో ముచ్చటించడంతో ఈ ఫోటో వైరల్ అయింది. జమాల్‌పూర్‌లోని ఖాన్కా రెహమానీ మసీదు పెద్ద మౌలానాను రాహుల్ కలిశారు. ఆయనతో పాటు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఉన్నారు. రాజీవ్ 1985లో సందర్శించినప్పటి నుంచి వారి కుటుంబంతో ఈ మసీదుకు అనుబంధం ఏర్పడింది. మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ సహా ఎందరో ప్రముఖులు ఈ మసీదును గతంలో సందర్శించారు.

ట్రంప్‌పై విమర్శలతో ఎఫ్‌బీఐ తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతున్నా... ట్రంప్‌పై జాన్ బోల్టన్ విమర్శలు కొనసాగించారు. ట్రంప్ జోక్యం చేసుకున్నా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపులో ఎలాంటి పురోగతి లేదని వ్యాఖ్యానించారు. 'రష్యా తన లక్ష్యాన్ని మార్చుకోలేదు. తన సామ్రాజ్యంలో ఉక్రెయిన్‌ను విలీనం చేయాలని చూస్తోంది. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ప్రాంతంతోపాటు మిగిలిన ప్రాంతా ల కోసం డిమాండ్ చేస్తోంది. వాటికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అంగీకరించరు. ట్రంప్‌నకు నోబెల్ బహుమతి కావాలి. రెండు దేశాలతో సమావేశాలు నిర్వహిస్తూనే ఉంటారు. వాటిలో పురోగతి ఉంటుందని నేను అనుకోవట్లేదు' అని అన్నారు.

సీపీఐ అగ్రనేత సురవరం కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ నాయకులుగా కొనసాగారు. సుధాకర రెడ్డి మంచి చదువరి. నిజానికి పుస్తకాల పురుగు. క్రియాశీల రాజకీయాల నుంచి విరమించుకున్న తరవాత ఎక్కువ సమయం పుస్తక పఠనంలోనే గడిపారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శిగా వరసగా రెండుసార్లు పని చేశారు. రాజకీయాలలో ఆయన మేధావిగా ప్రసిద్ధుడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక సదస్సులు, గోష్ఠుల్లో పాల్గొన్నారు. ప్రజోద్యమాలను నిర్మించడంలో ఆయనకు ఆయనే సాటి. ఆ క్రమంలో కనీసం కొన్ని డజన్ల సార్లు అరెస్టయ్యారు. జైలులో ఉన్నారు. అనేక కేసులు ఎదుర్కోవాల్సి వచ్చింది. వామపక్ష పార్టీల ఐక్య కార్యాచరణలో భాగంగా అనేక పోరాటాలకు రూపకల్పన చేశారు. అనేక రాష్ట్రాలలో జైలు శిక్షలు అనుభవించారు. లక్నో, కోల్‌కతా జైళ్లలో గడపాల్సి వచ్చింది. చంద్రబాబునాయుడు హయాంలో విద్యుత్ ఉద్యమంలో ఆయన తీవ్రంగా గాయపడడమే కాక జైలులో ఉండాల్సి వచ్చింది. మునుపటి సోవియట్ యూనియన్ సహా చైనా, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, ఫ్రాన్స్, జర్మని, ఇటలీ, మంగోలియా, హంగేరి, బ్రిటన్, అమెరికా దేశాలలో పర్యటించారు. ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీకి చాలాకాలం ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. సుధాకర రెడ్డి బహు గ్రంథ రచయిత.

నాయకుడు... తమ పార్టీకి, కేడర్‌కు, జాతి భవితకు ఓ రాడార్. తన మాటతో, చేతతో కార్యకర్తలను కదంతొక్కించడమే కాదు, తన వాదన పటిమతో ప్రత్యర్థులను పరుగులు పెట్టించడం, మేధావులు, నిపుణులు, విశ్లేషకుల మద్దతు పొందడం సమర్థ నాయకత్వ లక్షణం. అధ్యయనం, అవగాహన, ఆచరణ... త్రివేణి సంగమంగా మదిలో, హృదిలో మథనం జరిగితేనే జనాభ్యుదయం. దేశ హితం కాంక్షించే దశ, దిశలో తను సాగడమే కాదు, జాతిని కదిలించగలుగుతారు. అటువంటి వ్యక్తులే నిజమైన జాతి నేతలు కాగలుగుతారు. ప్రస్తుత రాజకీయాల్లో తనదైన విలక్షణత్వం, విశుద్ధ మార్గంతో మార్క్సిస్టు-లెనినిస్టు పంథాలో సమసమాజమే లక్ష్యంగా ముందుకు సాగిన నేత సురవరం సుధాకరరెడ్డి. మతవాద, మితవాద, బూర్జువా రాజకీయాల్లోని క్రూరత్వాన్ని, కుటిలత్వాన్ని, స్వార్థపూరిత దోపిడీ విధానాలను ఎండగడుతూ లౌకిక, ప్రజాతంత్ర శక్తులకు అండగా నిలుస్తూ భారత కమ్యూనిస్టు పార్టీకి కార్యదర్శిగా తన కర్తవ్యాన్ని త్రికరణశుద్ధిగా నిర్వహించిన, నిజమైన ప్రజా ఉద్యమ నేత ఆయన. పాఠశాల స్థాయి నుంచే ప్రశ్నించడం నేర్చున్నారు. విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొన్నారు. తన వాగ్ధాటితో జనాకర్షక నేతగా ఎదిగారు. తన అధ్యయనం, సైద్ధాంతిక బలంతో దార్శనికునిగా పేరొందారు. భూస్వామ్య కుటుంబమైనా ఎటువంటి భేషజాలు లేవు. రజాకార్లు తమ ఇంటిని తగలబెట్టినా, కుటుంబాన్ని వెంటాడినా వెరవకుండా ప్రజా ఉద్యమబాట పట్టారు. ప్రతి ప్రతిబంధకాన్నీ తన పోరాటానికి నిచ్చెన మెట్లుగా మలచుకున్నారు. పాలకులు పట్టి జైల్లో పెట్టినా... ఆ సెల్‌నే ఉద్యమాలకు పురుటిగడిగా మార్చుకున్నారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా కమ్యూనిస్టుగా ముందుగా స్పందించడం, దానితో పాటు తానున్నాంటూ ఆయన ప్రజాక్షేత్రంలో ఉద్యమబావుటా ఎగురవేయడం ఆయనకు నిత్యకృత్యం. పోరాటాల గడ్డ నల్లగొండ నుంచి పార్లమెంటులో అడుగుపెట్టినా... కార్యకర్త నుంచి పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎదిగినా ఆయన ఆలోచన, ఆచరణలో ఏ మార్పులేదు. నిరాడంబరత ఆయన శైలి. నల్లకుబేరుల జాతకాలపై తొలిసారి పార్లమెంటు వేదికగా గళం విప్పిన ఘనత ఆయన సొంతం. ఎర్రజెండా చేతబట్టి దశాబ్దాలకు పైగా అలుపెరగని పోరు సాగించారు.

సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గం సంతాపం

మన ప్రియమైన మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎస్. సుధాకర్ రెడ్డి మృతిని సిపిఐ తీవ్ర దుఃఖంతో ప్రకటిస్తోంది. 1942లో జన్మించిన కామ్రేడ్ సుధాకర్ తన జీవితాంతం కార్మికవర్గం మరియు అణగారిన వర్గాల పోరాటాలకు అంకితం చేశారు, 2012 నుండి 2019 వరకు సిపిఐ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు మరియు లోక్‌సభలో రెండుసార్లు నల్గొండకు ప్రాతినిధ్యం వహించారు. ప్రజల కోసం జీవితాంతం పోరాడిన ఆయన, సిపిఐ %ప% వామపక్ష ఉద్యమం పట్ల తన వినయం, స్పష్టత, అచంచల నిబద్ధతకు గుర్తుండిపోతారు. రెడ్ సెల్యూట్, కామ్రేడ్. మీరు మా పోరాటాలలో ఎప్పటికీ జీవిస్తారు.

గొప్పనేతను కోల్పోయాం: రామకృష్ణ

సురవరం సుధాకరరెడ్డి మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. సురవరం సుధాకరరెడ్డి మరణం బాధాకరం. తాను నమ్మిన సిద్ధాంతం కోసం, కమ్యూనిస్టు పార్టీ ఉన్నతి కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవిత చరమాంకం వరకు ఆయన శ్రమించారు. 2012 నుండి 2019 వరకు సీపీఐ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. నల్గొండ లోక్‌సభ నియోజకవర్గ నుండి సీపీఐ అభ్యర్థిగా రెండు పర్యాయాలు విజయం సాధించి పార్లమెంటులో ప్రజా సమస్యలపై గళమెత్తి

ప్రజావాణి వినిపించారు. వామపక్ష ఉద్యమాలలో ఎనలేని పాత్ర పోషించారు. కమ్యూనిస్టు పార్టీ పురోభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి మరువలేనిది. వినయం, అచంచల నిబద్ధతకు ఆయన మారుపేరు. సుధాకరరెడ్డి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు. అనర్గల ఉపన్యాసకుడిగా, జననేతగా పేరుగాంచిన సురవరం సుధాకరరెడ్డి మరణం పట్ల సిపిఐ రాష్ట్ర సమితి తరఫున ప్రగాఢ సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ప్రముఖుల సంతాపం

సురవరం సుధాకరరెడ్డి మృతికి ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ఆయన మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. సురవరం మృతికి సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరారు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ తదితరులు సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

పదోన్నతులకు ఎదురుచూపు

- ఆరేళ్లుగా నిరీక్షణ... పదవీ విరమణ
- సీఎంఓకి అర్హుల ఫైలు
- ప్రభుత్వంలో విలీనం తర్వాతే సమస్యలంటున్న ఆర్టీసీ ఉద్యోగులు

విశాలాంధ్ర -సచివాలయం: రాష్ట్రంలో ఆర్టీసీ ఉద్యోగులు పదోన్నతి కోసం ఎదురు చూసున్నారు. ఉద్యోగులను 2020 జనవరిలో ప్రభుత్వంలో విలీనం చేశారు. ఉద్యోగ నియామకాలు చేపట్టి పదోన్నతులు ఇవ్వాలని అప్పటి ప్రభుత్వం భావించింది. రకరకాల కారణాలతో ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. గత ఏడాది రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. అధికారుల పదోన్నతులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో ఆ ప్రక్రియను ముగించారు. దీంతో ఇక తమకు పదోన్నతులు దక్కుతాయనే ఆశాభావంతో ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. పదోన్నతులకు అర్హులైన ఉద్యోగుల జాబితాను నాలుగు నెలల కిందటే అధికారులు రూపొందించారు. వీరిలో డ్రైవర్, కండక్టర్, మెకానిక్ కేడర్ ఉద్యోగులు మూడు వేల మంది ఉన్నారు. వీరికి పదోన్నతి వివరాలు ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి పంపారు. ఆర్థికశాఖ అనుమతి సైతం వచ్చినట్లు అధికారులు చెపుతున్నారు. అనుమతి కోసం సీఎంఓకి పదోన్నతి ఫైలు చేరింది. ప్రస్తుతం అక్కడ పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెపుతున్నారు. ఉద్యోగ సంఘాల నేతలు సైతం పలుమార్లు ఉన్నతాధికారులను కలిసి సీఎంఓలో ఫైలు ఆమోదానికి కృషి చేయాలని కోరారు. ఉన్నతాధికారులు సైతం పదోన్నతుల హామీ ఇస్తున్నారే తప్ప పరిష్కారం దిశగా కృషి చేయడం లేదని ఉద్యోగులు పేర్కొంటున్నారు. అర్హులైన వారిలో అనేక మంది ఉద్యోగ విరమణకు చేరువలో ఉన్నట్లు చెపుతున్నారు. మూడు దశాబ్దాలకు పైగా ఆర్టీసీలో సేవలు అందించిన తాము పదోన్నతి పొందకుండానే విరమణ చేయడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 55 ఏళ్ల పైబడిన మహిళా ఉద్యోగులకైనా ఓడీ విధులు అప్పగిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కనీసం పదవీ విరమణ లోపు ఒక్క పదోన్నతైనా దక్కితే చాలంటూ ఉద్యోగులు అధికారులు చుట్టూ ప్రదిక్షణలు చేస్తున్నారు. అయితే ఒక్కసారి మూడు వేల మందికి పదోన్నతులు ఇస్తే ఉద్యోగుల కొరత ఏర్పడొచ్చనే ఆలోచనే పదోన్నతుల్లో జాప్యానికి కారణంగా భావిస్తున్నారు. కనీసం 10వేల పోస్టులను భర్తీ చేస్తే ఆర్టీసీ నిర్వహణ మెరుగుపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఆర్టీసీలో ఉన్నప్పుడు పదోన్నతుల ప్రక్రియ సజావుగా సాగేదని ఉద్యోగులు చెబుతున్నారు. ప్రభుత్వంలో విలీనం తర్వాతనే సమస్య ఎదురవుతోందని పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సీఎం జోక్యం చేసుకొని పదోన్నతుల ఫైలుకు అనుమతి ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు.

తాత్కాలిక డ్రైవర్లకు భత్యం

ఈయూ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీలో డబుల్ డ్యూటీ(డీడీ) చేస్తున్న పూర్తిస్థాయి డ్రైవర్లకు ఇచ్చే భత్యం తాత్కాలిక డ్రైవర్లకు వర్తింపజేయాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్టీసీలో డ్రైవర్ల ఖాళీల భర్తీకి ప్రభుత్వం నుంచి అనుమతులు రాని కారణంగా... బస్సుల నిర్వహణకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకుగాను ఈయూ రాష్ట్ర కమిటీ దఫాలుగా చేసిన విజ్ఞప్తుల మేరకు డబుల్ డ్యూటీ చేసే కండక్టర్లకు రూ.700 నుంచి రూ.900, డ్రైవర్లకు రూ.800 నుంచి రూ.1,000 వరకు చెల్లించాలని అన్నారు. ప్రత్యేక విధులకు, రాత్రి విధులకు హాజరయ్యే కండక్టర్లకు రూ.1800, డ్రైవర్లను రెండు మస్తర్లు వచ్చే డ్యూటీలకు పంపితే రూ.రెండువేలు చెల్లించాలని యాజమాన్యం ఆదేశాలు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. కొన్ని జిల్లాలలో ఆర్టీసీ యాజమాన్యం ఆదేశాలకు భిన్నంగా పల్లె వెలుగు బస్సులు, నాన్‌స్టాప్, ఎక్స్‌ప్రెస్ డ్యూటీకి విభిన్నంగా చెల్లిస్తున్నారని చెప్పారు. దీనివల్ల తాత్కాలిక డ్రైవర్లకు కష్టానికి తగిన ఫలితం రావడంలేదని అసంతృప్తికి గురవుతున్నారని పేర్కొన్నారు. డైలీ ఇన్సెంటివ్‌లను గతంలో అద్దె బస్సు డ్రైవర్లకు చెల్లించేవారని, ప్రస్తుతం వారికి కొన్ని డిపోలలో చెల్లించడంలేదన్నారు. యాజమాన్యం వెంటనే పునఃపరిశీలించి అద్దె బస్సులు, తాత్కాలిక డ్రైవర్లకు ఇన్సెంటివ్ ఇచ్చేలా ఆదేశాలివ్వాలని కోరారు.

రైతులకు సక్రమంగా ఎరువులు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఎరువుల కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి, బ్లాక్ మార్కెటింగ్ అరికట్టి, ఎరువులను సక్రమంగా సరఫరాకు తగిన చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూరియా, డీఏపీ ఎరువులు అందక రైతులు రోడ్డెక్కే పరిస్థితి దాపురించిందని, ఇది చాలా బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్రమంతా స్మార్ట్ పాలన జరుగు తోందని, గత ఏడాదికాలంగా పరిపాలన గాడిలో పెట్టామని కూటమి ప్రభుత్వం చెబుతోందని, రైతాంగానికి మాత్రం ఎరువులు ఇవ్వలేక పోతున్నారని అన్నారు. రాష్ట్రంలో సాగు విస్తీర్ణం తగ్గిపోయిందని, రాయలసీమ ప్రాంతంలో వేరుశనగ రైతులు పంట సాగు తగ్గించారని వివరించారు. నాగార్జునసాగర్ ఆయకట్టు కింద అసలు పంటలే మొదలు కాలేదని, అప్పుడే ఎరువులు దొరకడం లేదంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారంటే బ్లాక్ మార్కెటింగ్ ప్రభావం ఏ మేరకు ఉందో అర్థమవుతోందని తెలిపారు. యూరియాపై రూ.100, డీఏపీపై రూ.200 అదనంగా బ్లాక్‌లో అమ్ముతున్నారంటే ప్రభుత్వాధికారులు, విజిలెన్స్ డిపార్ట్‌మెంట్, పోలీసులు ఏం చేస్తున్నారో ప్రభుత్వమే సమాధానం చెప్పాలని నిలదీశారు. సీఎం చంద్రబాబు... రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని ప్రచారం చేయమని చెబుతున్నారని, కనీసం రైతులకు ఎరువులు సరఫరా చేయకుండా, బ్లాక్ మార్కెట్లో అమ్మకాలు సాగుతుంటే సుపరిపాలన ఎలా అవుతుంది అని ప్రశ్నించారు. మార్క్‌ఫెడ్‌కి 50 శాతం, ప్రైవేట్‌కి 50 శాతం సరఫరా చేస్తామని చెబుతున్నారు... మార్క్‌ఫెడ్‌కి ఇచ్చే ఎరువుల శాతాన్ని మరో 10శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలని, అందుకోసం ఒక రాష్ట్ర మంత్రి పర్యవేక్షణలో, సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించి రాష్ట్రవ్యాప్తంగా రైతాంగానికి ఎరువులను సక్రమంగా సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు.

రైతు సంక్షేమం పట్టని బాబు: కాకాణి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కూటమి పాలనలో రాష్ట్రంలో అవినీతి మాఫియా రాజ్యమేలుతోందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రజలను ఏ విధంగా దోచుకుని, అవినీతి సంపాదన కూడబెట్టుకుందామన్న ఆలోచన తప్ప ఈ ప్రభుత్వానికి రైతుల కష్టాలు, వారి సంక్షేమం గురించి ఆలోచించే తీరిక లేదని మండిపడ్డారు. ఒకవైపు భారీ వర్షాలు, మరోవైపు కరువుతో అన్నదాతలు అగచాట్లు పడుతుంటే, వారిని ఆదుకోవడానికి నిర్దిష్టమైన కార్యాచరణ లేదన్నారు. భారీ వర్షాలు కురుస్తుంటే... పంట ఏ మేరకు నష్టపోయిందన్న అంచనాలు లేవని, వర్షాభావ పరిస్థితులున్న ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు చేపట్టాలి... ప్రత్యామ్నాయ మార్గాలేంటి అన్న ఆలోచన కరవైందని, ఇది అత్యంత దుర్మార్గమని తెలిపారు. జగన్ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా 12.70లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు పంపిణీ చేశామని, విత్తనాలు, క్రిమిసంహారక మందులు, ఎరువులు అన్నీ రైతులు గ్రామం దాటి వెళ్లాల్సిన అవసరం రాకుండా ఆర్బీకేల దగ్గరే ఏర్పాటు చేశామని వివరించారు. ఎరువులు కొరతతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. తక్షణమే రైతు సమస్యలను తీర్చాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అర్హుల పింఛన్లు తొలగించం

ప్రతిపక్ష పార్టీల దుష్ప్రచారం నమ్మొద్దు: మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర - సచివాలయం: అర్హుల పింఛన్లను తొలగించే ప్రసక్తే లేదని, ఈ విషయంలో ప్రతిపక్ష పార్టీ చేస్తున్న రాద్ధాంతం, దుష్ప్రచారంలో ఏమాత్రం పసలేదని, ఎవరూ నమ్మవద్దని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని కాంక్షిస్తూ సామాజిక భద్రతా పింఛన్లకు శ్రీకారం చుట్టింది... కాలానుగుణంగా పెంపుదల చేసింది తమ ప్రభుత్వమేనని, అటు వంటప్పుడు ఆ పింఛన్లను తొలగించేందుకు ఎందుకు ప్రయత్నిస్తుందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్లో శుక్రవారం మీడియాతో మంత్రి మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛను పథకాన్ని తమ ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో అమలు పరుస్తున్నదన్నారు. అందుకు బడ్జెట్‌లో రూ.33 వేల కోట్లు కేటాయించిందన్నారు. గత ఏడాది జులై ఒకటో తేదీ నుంచి ప్రతి మాసం 65.18 లక్షల మందికి రూ.2,700 కోట్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. దాదాపు 1.10 లక్షల స్పౌస్ పింఛన్లు మంజూరు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం 63.71 లక్షల మందికి పింఛన్లను అందజేస్తున్నట్టు తెలిపారు.గత ప్రభుత్వంలో ప్రతి ఆరు మాసాలకు ఒక సారి సిక్స్ స్టెప్ వేలిడేషన్ ప్రక్రియ అంటూ దాదాపు 9.56 లక్షల పింఛన్లను రద్దు చేసినట్టు వివరించారు. అంబేద్కర్ కోనసీమ, వై.ఎస్.ఆర్.కడప జిల్లాల కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో తనిఖీల తదుపరి తమ జిల్లాల్లో అనర్హులైన వారు ఆరోగ్య, దివ్యాంగుల కేటగిరీల్లో పింఛన్లు పొందుతున్నట్లు గుర్తించిన విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 125 కేంద్రాల్లో సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించడం జరిగిందన్నారు. దాదాపు 7.95 లక్షల మంది సర్టిఫికెట్లను తిరిగి పరిశీలించాల్సి ఉండగా, ఇప్పటి వరకూ 5.55 లక్షల మందికి సంబంధించి రీ-వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్టు చెప్పారు. దాదాపు 80 వేల మంది అనర్హులను గుర్తించడం జరిగిందన్నారు. సర్టిఫికెట్ల రీ-వెరిఫికేన్‌లో ఎవరికన్నా అన్యాయం జరిగితే సంబంధిత అధికారులకు అప్పీలు చేసుకున్న వెంటనే వారి అర్హతలను మరో సారి పరిశీలించి అర్హులైతే వెంటనే పింఛను పునరుద్దరించడం జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు.

భక్తిపై రాజకీయాలా?

వైసీపీపై మంత్రి ఆనం ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: హిందూ ధర్మం, ఆచారాలు, భగవంతుడిని రాజకీయ ఉచ్చులోకి లాగే ప్రతిపక్షం రాష్ట్రంలో ఉండటం బాధాకరమని, ఇటువంటి రాజకీయాల గురించి మాట్లాడటం కూడా దురదృష్టకరమని దేవాదాయ శాఖ మంత్రి అనం రామనారాయణరెడ్డి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం మంత్రి మీడియాతో సమావేశంలో మాట్లాడుతూ... ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి గత ప్రభుత్వ దుర్మార్గపు పాలన నుంచి రాష్ట్రాన్ని, ప్రజలను కాపాడుతూ, దేవాలయాలను పవిత్రం చేయాలని నిర్ణయించారన్నారు. తిరుమల వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో పాలన ప్రారంభించిన చంద్రబాబు... అన్ని మతాలను గౌరవిస్తామని చెప్పారన్నారు. అయితే, ప్రతిపక్ష హెూదా లేని ఒక పార్టీ, నాయకత్వం లేని నేత, హిందూ మతంపై విశ్వాసం లేని వ్యక్తులు రాజకీయ కుటిల క్రీడలో భాగంగా హిందువుల మనోభావాలను గాయపరుస్తూ దేవాలయాలపై విషప్రచారం చేయడం బాధాకరమన్నారు. తిరుమలపై వైసీపీ నాయకులు చేస్తున్న విషప్రచారానికి దేవుడు క్షమించడని, జరగని విషయాలను జరిగినట్లు అనుకూల మీడియాలో ప్రచారం చేస్తే ప్రజలు నమ్ముతారని వైసీపీ భ్రమలో ఉందని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ప్రతిపక్షం లేని శాసనసభను ఎన్నడూ చూడలేదన్నారు. వైసీపీ నడిపిన లిక్కర్ స్కాం దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని, భూదోపిడీ విషయాలు కూడా బయటకు వస్తున్నాయని ఆయన వెల్లడించారు. ప్రజల దృష్టిని మరల్చడానికి జగన్ "డైవర్షన్ పాలిటిక్స్" ఎంచుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన 95 శాతం హామీలను నెరవేర్చిందన్నారు. కరుణాకర్ రెడ్డి నాస్తికుడని అందరికీ తెలుసని, టీటీడీని రాజకీయ అడ్డాగా మార్చి దోపిడీ చేసినవాడు ఇప్పుడు పవిత్రత గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు చదివినట్లు ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

యాక్సిస్‌పై ప్రభుత్వానికి ప్రేమెందుకు?

ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: యాక్సిస్ బ్యాంక్‌పై ప్రభుత్వానికి అంత ప్రేమెందుకని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆసుల రంగనాయకులు, పోరుమామిళ్ల సుబ్బరాయుడు సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న దాదాపు మూడు లక్షల మంది పైచిలుకు అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్, పూర్తి స్థాయి ఉద్యోగ, కార్మికుల ఖాతాలను... ప్రభుత్వ బ్యాంకులు అయిన ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ తదితర బ్యాంకుల ద్వారా వేతనాలు వేయగా... తాజాగా ప్రైవేట్ కార్పొరేట్ బ్యాంకు అయిన యాక్సిస్ బ్యాంకుకు చెల్లిస్తామని ఉత్తర్వులు ఇవ్వడాన్ని తప్పుపట్టారు. ప్రభుత్వ బ్యాంకులపై ఉన్న ద్వేషం, యాక్సిస్ బ్యాంకుపై ఉన్న ప్రేమ ఏమిటో జవాబుదారీతనంగా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. మునిసిపల్ పరిపాలనా విభాగం అధికారి తప్పనిసరిగా మునిసిపల్ కార్మికులు యాక్సిస్ బ్యాంకులో ఖాతాలు తెరవాలని కమిషనర్లను ఆదేశించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ బ్యాంకుల పరిరక్షణకు, ఉద్యోగ కార్మికుల భద్రత కోసం ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ భవిష్యత్ పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు.

హమాలీ కార్మికుల కూలి పెంపుదల

వెంకట సుబ్బయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ బేవరేజెస్ కార్పొరేషన్ ఐఎంఎఫ్ఎల్ డిపోలలో ఎగుమతి, దిగుమతి పనులు చేస్తున్న హమాలీ కార్మికులకు 6.60 పైసల నుంచి 7.20 పైసల వరకు కూలి పెంచినట్లు ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.వెంకటసుబ్బయ్య వెల్లడించారు. మంగళగిరి కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సీజీఎం చరణ్, మేనేజర్ అనసూయ, డిస్టలరీస్ అసోసియేషన్ అధ్యక్షులు కామేశ్వరరావు, హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, లోకేశ్వరరావు, సీఐటీయూ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, సుబ్బారెడ్డి, వైఎస్ఆర్టీయూ రాష్ట్ర నాయకులు వైవీ రమణ, టీఎస్‌టీయూసీ నాయకులు మల్లికార్జున తదితరులు శుక్రవారం మద్యం కంపెనీల యాజమాన్యంతో చర్చించారు. ఈ పెంపుదల రెండేళ్ల పాటు అమలులో ఉంటుందని, నెల బకాయి వేతనం ఇవ్వడానికి యజమాన్యం అంగీకరించినట్లు వెంకట సుబ్బయ్య వివరించారు. ఒకపక్క అధిక ధరలు, పన్నులు, చార్జీలు, అధిక ఖర్చులు పెరిగిన సందర్భంలో కష్టపడి పని చేస్తున్న కార్మికులకు ఈ పెంపుదల కొంత ఉపశమనం కలుగుతుందని కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. అధికారులకు, కంపెనీల యాజమాన్యానికి యూనియన్ నేతలు ధన్యవాదాలు తెలిపారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ దుస్సాహసమే

మానవ హక్కుల వేదిక

విశాఖపట్నం : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం అడుగులు వేయడాన్ని మానవ హక్కుల వేదిక శుక్రవారం తీవ్రంగా ఖండించింది. ఇటీవల స్టీల్ ప్లాంట్‌లోని బ్లాస్ట్ ఫర్నేస్ వ్యవస్థలు, స్లాగ్ గ్రాన్యులేషన్ ప్లాంట్‌లు, మైన్స్, బీఎఫ్ కూలింగ్, ఫర్నేస్ ఉపకరణాలు, ఛార్జింగ్ యూనిట్‌లు సహా 34 కీలక విభాగాల ఆపరేషన్, నిర్వహణ చేపట్టేందుకు ప్రైవేటు ఏజెన్సీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) ని కోరడమంటే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగం నుంచి ఉపసంహరించే ఒక స్పష్టమైన అడుగు అని అర్థమవుతోందని వేదిక ఒక ప్రకటనలో పేర్కొంది. లక్షలాది ప్రజల ఉద్యమాలు, త్యాగాలతో సాధించుకున్న జాతీయ ఆస్తి అయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు ఆశ్రిత పెట్టుబడిదారులకు అప్పగించే దుస్సాహస ప్రయత్నమని విమర్శించింది. జరుగుతున్నది దోపిడీ అని... స్టీల్ ప్లాంట్‌ను ముక్కలు ముక్కలుగా అమ్మేయడం కంటే తక్కువ కాదని పేర్కొంది. ప్లాంట్‌లోని కీలక విభాగాలను ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించడమనేది కార్మిక వ్యతిరేక చర్య మాత్రమే కాదని... చట్టవిరుద్ధమని తెలిపింది. ఫ్యాక్టరీల చట్టం, వివిధ భద్రతా నిబంధనలు ప్రమాదకర యూనిట్లలో శాశ్వత శిక్షణ పొందిన, అనుభవజ్ఞులైన కార్మికులను నియమించాలని స్పష్టంగా ఆదేశించాయి. ఈ విధులను అవుట్‌సోర్సింగ్ చేయడం వల్ల భద్రత దెబ్బతింటుంది. కార్మికుల జీవితాలు ప్రమాదంలో పడతాయి. చుట్టుపక్కల సమాజాలు ప్రమాదంలో పడతాయి. ప్రైవేట్ కాంట్రాక్టర్లది లాభాపేక్ష మాత్రమే. వారి కార్యకలాపాలకు కారణం కార్మికుల భద్రత రాజీపడుతుంది. ప్రమాదాలు జరిగినప్పుడు జవాబుదారీతనం ఉద్దేశపూర్వకంగా అస్పష్టమవుతుంది. ఇప్పటికే మనం విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల వ్యాప్తంగా పారిశ్రామిక విభాగాల్లో ప్రాణాంతకమైన ప్రమాదాలు తరచూ జరగడం చూశామని మానవ హక్కుల వేదిక పేర్కొంది. ఇటీవలి సంవత్సరాలలో విశాఖ స్టీల్ ప్లాంట్‌లో వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం, చాలా మంది రెగ్యులర్ కార్మికులు, అధిక అర్హత కలిగిన అధికారులను తొలగించడం మనం చూశాము. ఇది ఉద్యోగాలు కోల్పోవడం గురించి మాత్రమే కాదు. విశాఖ ఉక్కు కేవలం ఒక పారిశ్రామిక విభాగంకాదు. ఇది చారిత్రక, స్థిరమైన ప్రజల పోరాటానికి సజీవ రూపం. వేలాది కుటుంబాలు భూమి, జీవనోపాధిని వదులుకున్నాయి. 32 మంది వ్యక్తులు దానిని నిజం చేయడానికి తమ ప్రాణాలను కోల్పోయారు. ఇప్పుడు దానిని ప్రైవేటీకరించడం అంటే ఆ వారసత్వాన్ని అవమానించడమే. ఈ విషయంలో అధికార పార్టీ ఎన్నికయిన ప్రతినిధుల వంచన, ద్వంద్వ మాటలు నిజంగా సిగ్గుచేటు. వారు తరచూ బహిరంగంగా ఉక్కు కర్మాగారాన్ని సమర్థిస్తున్నట్లు చెబుతున్నారు. కానీ ప్రైవేటీకరణ చర్యలను మాత్రమే ప్రోత్సహిస్తున్నారు. కార్పొరేట్ వర్గాలకు సేవ చేయడం పట్ల వారి అభిమానం, నక్కపల్లిలో ప్రతిపాదిత మిట్టల్ స్టీల్ కర్మాగారాన్ని వారు ఇటీవల ఉత్సాహపరిచిన సందర్భంగా స్పష్టంగా కనిపించింది. ఇది ఇంతకు ముందెన్నడూ లేనంతగా బహిరంగంగా ఉంది. వారు ప్రజల నమ్మకాన్ని మోసం చేయడం పూర్తిగా పూర్తయింది. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని హెచ్‌ఆర్ఎఫ్ డిమాండ్ చేస్తోంది. ఈ విషయమై కార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు కొనసాగించాలని హెచ్‌ఆర్ఎఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.జనార్ధనరావు, ఏపీ, తెలంగాణ సమన్వయ కమిటీ సభ్యుడు వి.ఎస్.కృష్ణ ఆ ప్రకటనలో కోరారు.

వ్యవసాయ భూ పరిరక్షణ చట్టం చేయాలి

సీపీఎం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నాలా చట్టం రద్దు చేయాలని రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో వ్యవసాయ భూమి పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతు, వ్యవ సాయ కార్మిక సంఘాలతో చర్చించిన అనంతరమే అమలు చేయాలన్నారు. రియల్ ఎస్టేట్ ప్రయోజనం కోసం నాలా చట్టం రద్దు చేయడాన్ని ఆయన వ్యతిరేకించారు. ఇప్పటికే కార్పొరేట్ల కోసం రాష్ట్రంలో విచ్చలవిడిగా భూ సేకరణ జరుగుతుందని, వ్యవసాయోగ్యమైన భూములను కంపెనీలకు అప్పగిస్తున్న ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా వివిధ ప్రాంతాలలో రైతులు ఉద్యమిస్తున్నారని వివరించారు. వ్యవసాయ భూములను కార్పొరేట్ కంపెనీలకు సులభంగా అప్పగించేందుకే ఈ చట్టాన్ని రద్దు చేశారని వివరించారు. భూ వినియోగం విధానాన్ని ప్రభుత్వం రూపొందించాలని, ఏ రకం భూములను ఎందుకోసం వినియోగించాలన్న దానిపై స్పష్టమైన ప్రభుత్వ విధానం ఉండాలన్నారు. ప్రణాళికాబద్ధమైన నగర/పట్టణాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ భూములను, గ్రామాలను ఇష్టానుసారం పట్టణాలలో కలపరాదని డిమాండ్ చేశారు.

'సేవ్ విశాఖ స్టీల్'

- ప్రైవేటీకరణపై దద్దరిల్లిన జీవీఎంసీ కౌన్సిల్
- వామపక్ష, వైసీపీ కార్పొరేటర్ల నిరసన
- నల్ల చొక్కాలు... కండువాలతో ఆందోళన
- ప్లాంట్‌లో చర్యల విరమణకు ప్రభుత్వానికి ఏకగ్రీవ తీర్మానం
- మేయర్ హామీతో శాంతించిన సభ్యులు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం:
విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే కుట్రను విశాఖ వాసులుగా, పాలక మండలి కౌన్సిల్ సభ్యులుగా అడ్డుకోవాలని, 'సేవ్ విశాఖ స్టీల్ ప్లాంట్' అంటూ సీపీఐ ఫ్లోర్‌లీడర్ ఏజే స్టాలిన్, సీపీఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు, వైసీపీ కార్పొరేటర్లు ప్లకార్డులతో నినాదాలు చేశారు. మేయర్ పోడియం వద్ద బైఠాయించి నిరసనలు చేపట్టారు. వైసీపీ కార్పొరేటర్లు నల్ల చొక్కాలు, నల్ల కండువాలతో జీవీఎంసీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ఆందోళన చేపట్టారు. మేయర్ పీలా శ్రీనివాస రావు అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం జరిగింది. దాదాపు గంటన్నర పాటు స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని తూర్పారబట్టారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ముక్తకంఠంతో వ్యతిరేకించి, కేంద్ర నిర్ణయంపై కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని పట్టుబట్టారు. జీవీఎంసీకీ విశాఖ స్టీల్ ఆయువుపట్టుగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 2,200 కోట్లు , కేంద్రానికి రూ.2,700 కోట్లు పన్నుల ద్వారా చెల్లిస్తుందన్నారు. ఇటీవల 46 విభాగాలను విభజించి బడా కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు కేంద్రం కుట్ర చేసిందని వెంటనే ఈ టెండర్ ను రద్దు చేయాలని సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరణ చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని, మరో ఐదు వేల మందిని తొలగించేందుకే ఈ విభాగాలను ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకుంటున్నారని మండిపడ్డారు. బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ ఆంధ్రుల మనోభావాలతో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని స్పష్టం చేశారు. కేవలం పరిపాలన సౌలభ్యం కోసమే 700 నుంచి 1000 రంగాల్లో ఉన్న కాంట్రాక్టర్లను కుదించి కేవలం 46 విభాగాలుగా చేశారని, ఇది ప్రైవేటీకరణ కాదని, తప్పుదారి పట్టిస్తున్నారని ఎదురు దాడికి దిగారు. ప్లాంట్ సామర్థ్యం మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందన్నారు. సభ్యుల నిరసనతో హోరెత్తిన కౌన్సిల్ స్టీల్ ప్లాంట్ లో చేపడుతున్న చర్యలను వెంటనే విరమింప చేయాలని, ఏకగ్రీవ తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని మేయర్ హామీ ఇవ్వడంతో శాంతించారు. అనంతరం జీవీఎంసీలో టీడీఆర్‌ల కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. కోడి వ్యర్థాలు డంపింగ్ యార్డ్ కు తరలించకుండా, చేపల చెరువులకు తరలించి ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్నారని, వెంటనే కాంట్రాక్టర్ల ఆగడాలను, అధికారుల అవినీతిని అరికట్టాలని సభ్యులు కోరారు. స్మార్ట్ సిటీ పేరుతో విశాఖలో విలువైన ఆస్తులను తాకట్టు పెడుతున్నారని, వామపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P.)

E PROCUREMENT SHORT TENDER NOTICE(SECOND CALL)

NIT No. 13/ MAU61-USI0HB(OTH)/170/2025-HB/2nd call Dt.22.08.2025.

Name of Work: APCRDA - H&B - "Providing Comprehensive Annual Maintenance Contract to the seven (07) Nos. of UPS systems installed in the buildings of the High Court of A.P. at Nelapadu, Amaravati, for the period of 1 Year" - Estimate Cost Rs.7,10,000/-. The bid can be downloaded on AP e-procurement portal from 23.08.2025 to 01.09.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid 01.09.2025 up to 15.00 Hrs, Technical bid opening 01.09.2025 @16.00Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in

Sd/- Commissioner, APCRDA, Vijayawada

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
మెయిన్ బ్రాంచి-00890, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523002

స్వాధీనత ప్రకటన

(స్థిరాస్తి కొరకు) Appendix IV క్రింద యాక్ట్ రూల్-8(1) మరియు (2)

ఇందుమూలముగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 ప్రకారం భారతీయ స్టేట్ బ్యాంక్, మెయిన్ బ్రాంచి, ఒంగోలు, ప్రకాశం జిల్లా యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క సెక్షన్ 13(2) రూల్ 3వ నిబంధన క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన ఋణము మొత్తము **ది.16-06-2025 నాటికి బకాయి రూ.50,89,345/- (అక్షరాల యాభైలక్షల ఎనభైతొమ్మిదివేల మూడువందల నలభైఐదు రూపాయలు మాత్రమే)** తదుపరి **ది.16-06-2025** నుండి చెల్లించవలసిన వడ్డీ, ఖర్చులతో సహా చెల్లించమని కోరుతూ **ఋణగ్రహీత: శ్రీ మెలింగి ప్రభుదాసు, తండ్రి: వెంకటేశ్వర్లు**, డోర్ నెం.7-3-40, శ్రీనివాస కాలని, బాపట్ల, బాపట్ల జిల్లా-522101 & **శ్రీ మెలింగి ప్రభుదాసు, తండ్రి: వెంకటేశ్వర్లు**, డోర్ నెం.10-2-37, కొత్త వార్డు నెం.12, యాదవపాలెం, బాపట్ల, బాపట్ల జిల్లా-522101. **NPA-EB HL A/c No's: 31836049093 (HL), 36907745121 (TOP UP), 41675491960 (TOP UP)** వీరిని కోరుతూ **ది:16-06-2025** వ తేదీన డిమాండు నోటీసు జారీచేయడమైనది.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీత విఫలమైనందున సదరు రూల్ 8 తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన స్థిరాస్తిని సెక్యూరిటి ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రకారం ఈ దిగువ సంతకందారు **ది.18-08-2025** న సింబాలిక్ స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతకు/తనఖాదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ స్థిరాస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన పక్షంలో అవి **భారతీయ స్టేట్ బ్యాంక్, మెయిన్ బ్రాంచి, ఒంగోలు, ప్రకాశం జిల్లా యొక్క ఋణము మొత్తం ది.16-06-2025 నాటికి బకాయి రూ.50,89,345/- (అక్షరాల యాభైలక్షల ఎనభైతొమ్మిదివేల మూడువందల నలభైఐదు రూపాయలు మాత్రమే)** తదుపరి చెల్లించవలసిన వడ్డీ + ఖర్చులు మొదలగువాటికి లోబడి ఉంటాయని ఋణగ్రహీత/ తనఖాదారుకు/హామీదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియపరచటమైనది.

ఋణగ్రహీత/హామీదారు సదరు చట్టంలో సబ్ సెక్షన్(8) ఆఫ్ సెక్షన్ 13 ప్రకారం తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టి సారించవలసి ఉన్నది.

స్థిరాస్తి వివరము

శ్రీ మెలింగి ప్రభుదాసు, తండ్రి: వెంకటేశ్వర్లు గారికి చెందిన ఆస్తి

గుంటూరు జిల్లా, ప్రస్తుతం బాపట్ల జిల్లా, నరసరావుపేట రెవిన్యూ జిల్లా, రిజిస్ట్రేషన్, బాపట్ల సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, బాపట్ల మునిసిపాలిటి, పాత వార్డు నెం.7, కొత్త వార్డు నెం.12, కొత్త బస్టాండ్, డోర్ నెం.10-2-37, సాయిబాబా గుడి పరిధి, తూర్పు బాపట్ల గ్రామ తాలూక, సర్వే నెం.656, 145.2 చ॥గ॥లు లేక 121.968 చ॥మీ॥లు లేక ఎ॥0.03 సెంట్లు విస్తీర్ణములో నిర్మించిన నివాస భవనము యొక్క రిజిస్టర్ సేల్‌డీడ్ నెం.4775/2009, తేది:28-11-2009. **హద్దులు: తూర్పు:** మునిసిపల్ రోడ్డు-28'-00" అడుగులు, **దక్షిణం:** కుంచాల లక్ష్మీ గారికి చెందిన ఇంటి స్థలం-45'-06" అడుగులు, **పడమర:** పణుకూరి సాంబశివరావు గారికి చెందిన ఇంటి స్థలం-28'-00" అడుగులు, **ఉత్తరం:** బేతపూడి సాంబశివరావు గారికి చెందిన స్థలం-45'.06" అడుగులు.

ప్రదేశం: SBI మెయిన్ బ్రాంచి, ఒంగోలు
తేది : 18-08-2025

అధీకృత అధికారి
భారతీయ స్టేట్ బ్యాంక్

ఆర్‌ఎస్‌ఎస్ ఉత్సవాలకు కోవింద్



న్యూఢిల్లీ : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా అక్టోబరు 2న నాగ్‌పూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. 'రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వ్యవస్థాపక శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించే విజయదశమి ఉత్సవం అక్టోబరు 2, 2025న ఉదయం 7:40 గంటలకు నాగ్‌పూర్‌లోని రేషింబాగ్‌లో జరుగుతుంది' అని ఒక ప్రకటనలో పేర్కొంది. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఈ కార్యక్రమంలో ప్రసంగిస్తారని తెలిపింది. ప్రజలకు భారీ చేరువలో భాగంగా దేశ వ్యాప్తంగా ఇంటింటికి తిరిగి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆర్ఎస్ఎస్ నిర్ణయించింది.

చెన్నైను ముంచెత్తిన వర్షం

చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైను శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షంతో రోడ్లన్నీ పూర్తిగా జలమయమయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, కడలూరు జిల్లాలకు చెన్నై ప్రాంతీయ వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. నుంగంబాక్కం, అడయార్, రాజా అన్నామలైపురం, వడపళని సహా అనేక ప్రాంతాల్లో ఉదయం ఐదు గంటల నుంచి సుమారు ఐదు సెంటీమీటర్ల వర్షం కురిసింది. శనివారం తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్‌లో వివిధ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

పాఠశాలలకు ఆగని బెదిరింపులు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని పాఠశాలలకు వరుసగా ఐదోరోజు బాంబు బెదిరింపు ఈ-మెయిల్స్ వచ్చాయి. శుక్రవారం ద్వారకా సెక్టార్-7లోని ఒక పాఠశాలకు ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీ అగ్నిమాపక కార్యాలయానికి ఉదయం ఏడు గంటలకు సమాచారం అందగా... పోలీసులు, ఫైర్ బృందాలు సంఘటనా స్థలంలో తనిఖీలు నిర్వహించాయి. ఇప్పటివరకు 50కిపైగా పాఠశాలలకు ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. దాంతో పోలీసులతో పాటు ఇతర అత్యవసర సేవలన్నీ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టగా...అనుమానాస్పద వస్తువులు మాత్రం కనిపించలేదు. బెదిరింపులు వచ్చిన పాఠశాలల జాబితాలో రాహుల్ మోడల్ స్కూల్, మాక్స్‌ఫోర్ట్ స్కూల్, మాలవీయనగర్‌లోని ఎస్‌కేవీ, ప్రసాద్ నగర్‌లోని ఆంధ్రా స్కూల్స్ ఉన్నాయి. వరుస బెదిరింపులతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు పంపిన బెదిరింపు సందేశాల గురించి తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

డీకే శివకుమార్ ఆర్‌ఎస్‌ఎస్ పాట

బెంగళూరు: కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అసెంబ్లీలో ఆర్ఎస్ఎస్ గీతాన్ని ఆలపించడం ఆసక్తికరంగా మారింది. డీకే చర్యతో బీజేపీ ఎమ్మెల్యేలు ఆశ్చర్యంతో హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట ఘటనపై చర్చ సందర్భంగా ఈ పరిణామం చోటు చేసుకుంది. ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్... శివకుమార్‌కు ఆర్ఎస్ఎస్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. దీనికి ప్రతిస్పందనగా డీకే ఆర్ఎస్ఎస్ గీతం 'నమస్తే సదా వత్సలే' ఆలపించారు. డీకే ఆర్ఎస్ఎస్ గీతాన్ని ఆలపించడంతో అక్కడున్న బీజేపీ ఎమ్మెల్యేలంతా ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. గట్టిగా బల్లలు చరిచారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. సీఎం కుర్చీ ఇవ్వకుంటే తాను బీజేపీలో చేరుతానని కాంగ్రెస్‌కు డీకే హెచ్చరిక పంపారని నెటిజన్లు వ్యాఖ్యానాలు చేస్తున్నారు. మరోవైపు డీకే ఆర్ఎస్ఎస్ పాటను ఆలపించడంతో అసెంబ్లీలో గందరగోళం, వాగ్వాదం నెలకొంది. కర్నాటక కాంగ్రెస్‌లో అధికార మార్పిడి వ్యవహారం కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న సిద్ధరామయ్య స్థానంలో డీకే శివకుమార్‌ను సీఎంగా చూడాలని మెజారిటీ ఎమ్మెల్యేలు కోరుకుంటున్న తరుణంలో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది.

ఈసీపై ప్రతిపక్షాల ఐక్యపోరు: పవార్

ముంబై: ఎన్నికల సంఘం (ఈసీ)పై ప్రతిపక్షాలు ఐక్యంగా పోరాడుతున్నట్లు ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధ్యక్షుడు శరద్ పవార్ తెలిపారు. ఎన్నికల మోసాలను ప్రజల్లోకి తీసుకెళతామని చెప్పారు. గతంలో జరిగిన ఎన్నికల ఫలితాలను తమ పార్టీ కూడా అధ్యయనం చేస్తుందన్నారు. వాస్తవ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పవార్ నొక్కిచెప్పారు. ఓట్ల చోరీపై ప్రతిపక్షం ఐక్యంగా ఉందని ప్రకటించారు. ఒకరికి ఒకటే ఓటు సిద్ధాంతాన్ని అనుసరించడంలో ఎన్నికల సంఘం విఫలమైందని విమర్శించారు. కర్నాటకలోని మహదేవపుర నియోజకవర్గంలో ఐదు రకాలుగా ఓట్లు దోచుకున్నారన్న కాంగ్రెస్ ప్రచారంపై ప్రశ్నకు 'మేము కూడా ఎన్నికల ఫలితాలను అధ్యయనం చేస్తున్నాం. ఓట్ల చోరీపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఆ దిశగా ముందుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం అందుకు రెండు వారాలు పడుతుంది' అని పవార్ అన్నారు. ఈసీ నుంచి ఏమీ ఆశించడం లేదన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నుంచి అఫిడవిట్‌ను ఎన్నికల సంఘం కోరడాన్ని తప్పుపట్టిన పవార్... రాహుల్ తిరస్కృతిని సమర్థించారు. ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా 300 మంది ఎంపీలు వీధుల్లోకి వస్తే... అరెస్టు చేశారని వ్యాఖ్యానించారు. బీహార్‌లో రాహుల్ సభలకు అమితాదరణ లభిస్తోందని పవార్ వెల్లడించారు. 'అక్టోబరు లేక నవంబరులో బీహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయి. బీహార్ ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రమే కావచ్చుకానీ అక్కడి ప్రజల రాజకీయ అవగాహన ఉంది. మహాత్మాగాంధీ చంపారన్ నుంచి సత్యాగ్రహం మొదలు పెట్టారు. బీహార్ నుంచే ఎమర్జెన్సీ వ్యతిరేక పోరు జేపీ నారాయణ్ నాయకత్వంలో జరిగింది. కేంద్ర మాజీ మంత్రి కపూరీ ఠాకూర్ వంటి అనేక మంది ప్రజా నాయకులను ఈ రాష్ట్రం అందించింది' అని శరద్ పవార్ అన్నారు.

'ఇండియా' వైపే పవార్: ఫడ్నవీస్

ఎన్‌డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాల్సిందిగా విపక్ష నేతలను బీజేపీ కోరుతోంది. ఇందులో భాగంగా నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్‌చంద్ర పవార్) అధినేత శరద్ పవార్, శివసేన (ఉద్ధవ్) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రేలను మద్దతు కోరుతూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ సంప్రదించారు. దీనిపై శుక్రవారం మీడియాతో ఫడ్నవిస్ మాట్లాడుతూ మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు మద్దతు ఇవ్వాల్సిందిగా పవార్‌ను కోరానని, అయితే విపక్ష కూటమి అభ్యర్థి వెంటే తాము వెళతామని ఆయన చెప్పారని తెలియజేశారు. ఉద్ధవ్ ఠాక్రే మాత్రం దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారని వివరించారు. దీనికి ముందు శివసేన నేత సంజయ్ రౌత్ మాట్లాడుతూ దేవేంద్ర ఫడ్నవిస్‌తో పాటు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం ఠాక్రేను సంప్రదించారని, ఎన్‌డీఏ అభ్యర్థికి మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారని తెలిపారు. మహారాష్ట్రలోని విపక్ష మహాకూటమిలో కాంగ్రెస్‌తో ఎన్‌సీపీ (ఎస్‌పీ), శివసేన (యూబీటీ) భాగస్వాములుగా ఉన్నాయి. జాతీయస్థాయిలో 'ఇండియా' ఐక్యసంఘటనలో మూడు పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. శివసేన (యూబీటీ)కు లోక్‌సభలో 9 మంది, ఎన్‌సీపీ (ఎస్‌పీ)కి 10 మంది ఎంపీలు ఉండగా, రెండు పార్టీలకు రాజ్యసభలో చెరో ఇద్దరు ఎంపీలు ఉన్నారు. కేంద్రంలోని అధికార ఎన్‌డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయగా... సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డిని విపక్ష కూటమి ఎంపిక చేసింది. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. ఎలక్టోరల్ కాలేజీలో 781 మంది ఉండగా... మెజారిటీ మార్క్ 391గా ఉంది.

విజయ్ దిగజారుడు రాజకీయం

టీవీకే అధినేతపై మండిపడ్డ పార్టీలు

చెన్నై: టీవీకే అధినేత... నటుడు విజయ్‌పై రాజకీయ పార్టీలు మండిపడ్డాయి. గురువారం మధురైలో జరిగిన టీవీకే సమావేశంలో తమ నాయకులను లక్ష్యంగా చేసుకుని ఆయన విమర్శలు చేయడంపై అధికార డీఎంకే వర్గంతో పాటు ప్రతిపక్ష అన్నాడీఎంకే, బీజేపీ కూడా విజయ్‌పై ధ్వజమెత్తాయి. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌ను 'మామ' అని సంబోధించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర మునిసిపల్ పరిపాలన మంత్రి కె.ఎన్.నెహ్రూ నటుడు విజయ్ దిగజారుడు రాజకీయాన్ని ప్రదర్శించారని మండిపడ్డారు. 'నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న, ప్రస్తుత ముఖ్యమంత్రి అయిన ఒక గొప్ప రాజకీయ నాయకుడిని 'మామ' అని సంబోధించడంలో సరికాదని, ప్రజల మద్దతు ఉన్న డీఎంకే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్‌కు తగిన సమాధానం ఇస్తుంది' అని నెహ్రూ విలేకరులతో అన్నారు. ఇక మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ విలేకరులతో మాట్లాడుతూ 'బీజేపీని ఫాసిజంతో ముడిపెట్టి విజయ్ మాట్లాడుతున్నారు. బహుశా, పార్టీ సమావేశంలో నటుడు అందిస్తున్న స్క్రిప్ట్‌ను వేరొకరు రాసి ఉండవచ్చు' అని అన్నారు. 'ఇది కేవలం ఒక రోజు సినిమా షో' అని టీవీకే రెండవ సమావేశంలో విజయ్ ప్రసంగాన్ని విమర్శిస్తూ తమిళిసై అన్నారు. విజయ్ అన్ని రాజకీయ పార్టీలను విమర్శిస్తూ, 'మిస్టర్ ప్రైమ్ మినిస్టర్, మత్స్యకారుల సమస్యపై మీ కోసం నా నుంచి ప్రశ్నలు ఉన్నాయి' అని అన్నారు. కచ్చతీవు ద్వీపాన్ని శ్రీలంక నుంచి తిరిగి పొందేందుకు చర్యలు తీసుకోవాలని, తమిళనాడును నీట్ నుంచి మినహాయించాలని ఆయన ప్రధాన మంత్రిని కోరారు. కాగా, బీజేపీ నాయకుడు ఆర్.శరత్ కుమార్ మాట్లాడుతూ నటులు సహా ఎవరైనా రాజకీయాల్లో చేరడానికి స్వాగతం పలుకుతున్నప్పటికీ, విజయ్ ఏం మాట్లాడుతున్నాడో అతనికి తెలియదని అన్నారు. 'ఫాసిజం అంటే ఏమిటో ఆయనకు తెలుసో లేదో నాకు ఆశ్చర్యంగా ఉంది. ఆయన రాజకీయ అనుభవం లేని వ్యక్తి. ఏమి మాట్లాడాలో, పార్టీ సిద్ధాంతాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలో ఆయనకు తెలియదు. ఆయనకు మిస్టర్ ప్రైమ్ మినిస్టర్ అని అనే హక్కు లేదు' అని శరత్ కుమార్ టుటికోరిన్‌లో విలేకరులతో అన్నారు. ఏఐఏడీఎంకే ప్రతినిధి వైగై సెల్వన్ మాట్లాడుతూ 2026 అసెంబ్లీ ఎన్నికల తర్వాత విజయ్, అతని టీవీకే అదృశ్యమవుతారని అన్నారు. అన్నాడీఎంకే ఎవరి చేతుల్లో ఉందని ఆ నటుడు అడగడం చాలా వింతగా ఉందని అన్నాడీఎంకే రాష్ట్ర మాజీ మంత్రి ఆర్.బి.ఉదయకుమార్ వ్యాఖ్యానించారు. 'ఈ సందేహం ఎందుకు? మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె పళనిస్వామి అన్నాడీఎంకే నియంత్రణలో ఉన్నారని, కేంద్ర హోం మంత్రి అమిత్ షా 2026 ఎన్నికలకు పళనిస్వామిని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించారని ఆయనకు తెలియదా?' అని ఉదయ్ కుమార్ ప్రశ్నించారు.

దశాబ్దంలో 20 తొక్కిసలాటలు

బీజేపీ పాలిత రాష్ట్రాలపై సిద్దరామయ్య విమర్శలు

బెంగళూరు: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తొక్కిసలాటలు తరచూ జరుగుతాయని, గత పదేళ్లలో కనీసం 20 ఘటనలు చోటుచేసుకున్నాయని కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య వ్యాఖ్యానించారు. వీటి గురించి ఎందుకు మాట్లాడరని ప్రతిపక్ష బీజేపీని ప్రశ్నించారు. ఆర్సీబీ విజయోత్సవాల్లో భాగంగా బెంగళూరు స్టేడియంలో తొక్కిసలాట జరగడంపై విమర్శలను కొట్టిపారేశారు. ఇదే అంశంపై శుక్రవారం అసెంబ్లీలో సీఎం మాట్లాడారు. '2008 హిమాచల్ ప్రదేశ్‌లోని నైనాదేవి ఆలయంలో తొక్కిసలాట జరిగింది. అదే ఏడాది జోధ్‌పూర్‌లో తొక్కిసలాట చోటుచేసుకుంది. 2021లో హరిద్వార్‌లో, 2013 రతన్‌గఢ్‌లో, మధ్యప్రదేశ్‌లో, 2024 హత్రాస్‌లో ఘటనలు జరిగాయి. వందల సంఖ్యలో మరణాలు సంభవించాయి. ఈ ఏడాది జనవరిలో ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో 39 మంది ప్రాణాలు కోల్పోయారు. యూపీ ప్రభుత్వం మృతుల వివరాలు వెంటనే వెల్లడించలేదన్నారు' అని సిద్దరామయ్య అన్నారు. ఐపీఎల్‌లో విజయం సాధించడాన్ని గర్వంగా భావించి ఆర్సీబీ సంబరాలకు అభిమానులు తరలి రావడంతో చిన్నస్వామి స్టేడియంలో దుర్ఘటన జరిగింది. 11 మంది మృతి చెందగా, 50 మందికి పైగా గాయపడ్డారు. కర్నాటక ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసి ప్రత్యక్ష సాక్షులు, క్రికెట్ సంఘం అధికారులు, పోలీస్ అధికారుల వాంగ్మూలాలు సేకరించింది. ఆర్సీబీ కార్యక్రమంలో భద్రతా వైఫల్యం కనిపించిందని గుర్తించింది. స్టేడియం లోపల 79 మంది పోలీసులు మాత్రమే ఉండటం, అంబులెన్స్‌లు ఉండకపోవడం కమిషన్ గమనించింది. పోలీసు వైఫల్యం ఉందని నివేదికలో వెల్లడించింది. ఆర్సీబీ, కర్నాటక క్రికెట్ బోర్డు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. కర్నాటక హైకోర్టు కూడా ఈ కేసును విచారిస్తోంది.

బిగ్‌బాస్ విజేత ఇంటిపై కాల్పుల నిందితుడి అరెస్ట్

చండీగఢ్: యూట్యూబర్... హిందీలో ప్రసారమైన బిగ్‌బాస్ ఓటీటీ సీజన్-2 విజేత ఎల్విష్ యాదవ్ ఇంటిపై కాల్పులు జరిపిన నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. గతవారం ఇద్దరు దుండగులు కాల్పులు జరపడంతో సుమారు 24 బుల్లెట్లు యూట్యూబర్ ఇంట్లోకి దూసుకెళ్లాయి. అయితే ఆ సమయంలో ఎల్విష్ ఇంట్లో లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆ కాల్పులు జరిపిన ఇద్దరిలో ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. అతడిని ఇషాంత్ అలియాస్ ఇషు గాంధీగా గుర్తించారు. ఫరీదాబాద్‌లోని జవహర్‌నగర్ కాలనీకి చెందిన వాడని పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అతడికి సంబంధించిన సమాచారం అందడంతో నిఘాపెట్టారు. శుక్రవారం ఉదయం నీరజ్ ఫరీద్ పురియా ముఠాను కలిసేందుకు ఇషాంత్ వెళ్తుండగా పోలీసులు వెంబడించారు. దీంతో అతడు పోలీసులపై ఆటోమేటిక్ పిస్టల్‌తో ఆరు రౌండ్ల కాల్పులు జరిపాడు. ప్రతిగా పోలీసులు అతడి కాలిపై గన్‌తో కాల్చడంతో గాయపడ్డాడు. అనంతరం అతడిని అరెస్టు చేసి ఆసుపత్రికి తరలించారు.

వీధుల్లో కుక్కలకు ఆహారం పెట్టొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: వీధి కుక్కలకు బహిరంగ ప్రదేశాల్లో కాకుండా నిర్దేశిత ప్రాంతాల్లోనే ఆహారం పెట్టాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది. వీధి కుక్కలకు ఆహారం అందజేసేందుకు ప్రతి వార్డులో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని, నిర్దేశిత ప్రాంతాల్లో ఈ మేరకు నోటీసు బోర్డులు పెట్టాలని, ఎట్టిపరిస్థితుల్లో వీధుల్లో కుక్కలకు ఆహారం ఇవ్వకూడదని, ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలుంటాయని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

నియంత్రణ లేకుండా ఆహారం ఇవ్వడం వల్ల అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్న నివేదికలను పరిగణనలోకి తీసుకొని తాజా ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించింది. ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటినీ తరలించాలంటూ ఈనెల 11న ఇచ్చిన ఆదేశాలకు భిన్నంగా ప్రస్తుత ఉత్తర్వులు ఉన్నాయి. వీధి కుక్కల దాడులు పెరిగిపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన ద్విసభ్య ధర్మాసనం... ఢిల్లీలో మళ్లీ కుక్కలు కనిపించడానికి వీల్లేదని, వీటిని షెల్టర్లకు తరలించాలని పేర్కొంది. ఈ ఆదేశాలపై తీవ్ర అభ్యంతరాలు, నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. రేబిస్ లక్షణాలు లేదా విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలు మినహా ఇప్పటివరకు షెల్టర్లకు తరలించిన వాటి విడుదలకు ఆదేశించింది. వాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత ఎక్కడ నుంచి తెచ్చారో అక్కడే విడిచేయండి అని కోర్టు పేర్కొంది. తదుపరి విచారణను ఎనిమిది వారాలకు వాయిదా వేసింది.

అంబానీ తల్లికి అస్వస్థత

ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత, దేశంలోనే అత్యంత సంపన్నుడైన ముఖేష్ అంబానీ తల్లి కోకిలాబెన్ అనారోగ్యానికి గురయ్యారు. ఆమె ఆరోగ్యం క్షీణించినట్లు వార్తలు వచ్చాయి. కోకిలాబెన్ శుక్రవారం ఉదయం హెచ్ఎన్ రిలయన్స్ ఆసుపత్రిలో చేరినట్లు చెబుతున్నారు. ముఖేష్, అనిల్ అంబానీ తల్లి కోకిలాబెన్‌ను(91) హెచ్ఎన్ రిలయన్స్ ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలుస్తోంది.

మీడియా వార్తల ప్రకారం, కోకిలాబెన్ ఆరోగ్యం అకస్మాత్తుగా క్షీణించిందని, ఆ తర్వాత ఆమెను అత్యవసర పరిస్థితిలో హెలికాప్టర్ ద్వారా ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. కాగా అంబానీ కుటుంబం లేదా ఆసుపత్రి వర్గాలు ఇంకా ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. కొంతకాలంగా కోకిలా బెన్ వృద్ధాప్య సమస్యతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

ఐదేళ్ల తర్వాత తెరుచుకున్న భారత్-చైనా ట్రేడ్ పాస్‌లు

న్యూఢిల్లీ: భారత్-చైనా మధ్య మూడు సరిహద్దు వాణిజ్య కేంద్రాల మార్గాలు ఐదేళ్ల తర్వాత తెరుచుకొన్నాయి. అక్కడి ప్రజలకు, టిబెట్‌లో ఆర్థిక వ్యవస్థలకు ఈ మార్గాలు కీలకం. ఈ పాస్‌లు తెరుచుకొన్న విషయాన్ని రెండు దేశాలు అధికారికంగా ప్రకటించాయి. చైనా, భారత్ విదేశాంగ మంత్రులు వాంగ్‌యీ, జైశంకర్ న్యూఢిల్లీలో భేటీ సందర్భంగా ఈ నిర్ణయం తీసుకొన్నారు. తెరుచుకొన్న మార్గాల్లో హిమాచల్‌ప్రదేశ్‌లోని ది షిప్కిలా పాస్, ఉత్తరాఖండ్‌లోని లిపులేక్ పాస్, సిక్కింలోని నాథులా పాస్ ఉన్నాయి. 2020లో కొవిడ్ కారణంగా వీటిని మూసివేశారు. వర్తకులు డిమాండ్ చేస్తున్నా సరిహద్దు ఘర్షణలు, దీర్ఘకాలిక సైనిక ఉద్రిక్తతల వంటివాటి వల్ల వాటిని తెరవలేదు. ఈ మార్గాలు చైనా వైపు షిగాట్సె, లాసా, న్యింగ్చిలను చేరతాయి. వాస్తవానికి ఈ మార్గాల్లో వాణిజ్యం మే-నవంబర్ మధ్యలోనే జరుగుతుంది. ద్వైపాక్షిక వాణిజ్యానికి భిన్నంగా జరిగే ఈ వ్యాపారంలో భారత్ ఎక్కువ ఎగుమతులతో లబ్ధి పొందింది. ఈ మూడింటిలో నాథులా పాస్ అత్యంత రద్దీగా ఉండే మార్గం. రాకపోకలు, వాణిజ్యం అత్యధికంగా ఈ మార్గంలోనే జరుగుతుంది. సిక్కిం-టిబెట్ మధ్య వాణిజ్యానికి ఇదే కారణం. 2016లో అత్యధికంగా రూ.82.6 కోట్ల వాణిజ్యం జరిగింది. షిప్కిలా పాస్ నుంచి వాణిజ్యం పరిమితంగానే జరుగుతోంది. ఇది భారత్‌లోని నేషనల్ హైవే-5కు అనుసంధానమై ఉంది. దీనికి రెండువైపులా కస్టమ్స్ ఔట్‌పోస్టులు ఉన్నాయి. ఇప్పటివరకు ఆ ప్రాంతాల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో వాణిజ్యం జరగలేదు. ఉత్తరాఖండ్‌లోని పిథోర్‌ఘఢ్‌కు అనుసంధానమైన లిపులేఖ్ పాస్‌లో రహదారి సౌకర్యం అంత అనువుగా ఉండదు.

ఈసీఐ తీరు బహిర్గతం

ఎస్ఐఆర్‌పై సుప్రీం తీర్పును స్వాగతించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ : బీహార్‌లో ఎస్ఐఆర్ అంశంపై సుప్రీం కోర్టు ఆదేశాన్ని స్వాగతించిన కాంగ్రెస్ శుక్రవారం, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చేసిన 'క్రూరమైన దాడి' నుంచి ప్రజాస్వామ్యం బయటపడిందని, ఎన్నికల సంస్థ 'పూర్తిగా బహిర్గతమైందని, అపఖ్యాతి పాలైందని' పేర్కొంది. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలను చేర్చడం ద్వారా సవరణను మరింత కలుపుకునేందుకు సుప్రీం కోర్టు రక్షణ కవాటాలను ఏర్పాటు చేసిందని, ఇప్పటివరకు ఈసీఐ విధానం 'అడ్డంకి కలిగించేది... ఓటర్ల ప్రయోజనాలకు విరుద్ధంగా' ఉందని ప్రతిపక్ష పార్టీ ఆరోపించింది. ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కసరత్తులో భౌతిక సమర్పణలు చేయడంతో పాటు మినహాయించబడిన ఓటర్లు ఆన్ లైన్ పద్ధతి ద్వారా క్లెయిమ్‌లను సమర్పించడానికి అనుమతించాలని సుప్రీం కోర్టు ఎన్నికల సంఘాన్ని ఆదేశించిన తర్వాత కాంగ్రెస్ ఈ వ్యాఖ్యలు చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చితో కూడిన ధర్మాసనం ఆధార్ కార్డ్ నంబర్, ఎస్ఐఆర్‌లో 11 ఆమోదయోగ్యమైన పత్రాలలో ఏదైనా ఒకదానితో పాటు క్లెయిమ్ ఫారమ్‌లను సమర్పించడానికి అనుమతించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్ జైరాం రమేశ్ మాట్లాడుతూ బీహార్‌లో ఎస్ఐఆర్ అంశంపై సుప్రీం కోర్టు ఆదేశాలను పార్టీ స్వాగతిస్తున్నట్లు తెలిపారు. 'భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చేసిన 'క్రూరమైన దాడి నుంచి ప్రజాస్వామ్యం బయటపడింది' అని అన్నారు. ఆగస్టు 14న తొలగించబడిన ఓటర్ల జాబితాను నిలిపివేయాలనే ఈసీఐ నిర్ణయాన్ని సుప్రీం కోర్టు పక్కన పెట్టిందని ఆయన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు.

తమ్ముడూ... ఆ ద్రోహులతో జాగ్రత్త

పట్నా: తమ్ముడూ ఆ ద్రోహులతో జాగ్రత్త అంటూ రాష్ట్రీయ జనతాదళ్ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడు, మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ తన తమ్ముడు తేజస్వీ యాదవ్‌కు సలహా ఇచ్చారు. తేజ్ ప్రతాప్‌కు సంబంధించి ఇటీవల ఫేస్‌బుక్‌లో ఒక పోస్టు ప్రత్యక్షమైంది. ఆయన ఒక మహిళతో ఉన్న ఫొటో దానిలో ఉంది. ఆమె పేరు అనుష్క యాదవ్ అని, 12 ఏళ్లుగా తాము రిలేషన్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇది కాస్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో తేజ్ ప్రతాప్ తన కుటుంబ గౌరవాన్ని మంట గలుపుతున్నారని లాలూ ప్రసాద్ యాదవ్ అతడిని పార్టీ నుంచి ఆరేళ్ల పాటు బహిష్కరించారు. తండ్రి తీసుకున్న నిర్ణయంపై తేజ ప్రతాప్ స్పందిస్తూ... తనపై రాజకీయంగా, వ్యక్తిగతంగా కుట్ర జరుగుతోందని ఆరోపించారు. సమాజంలో పేరు ప్రతిష్టలున్న ఐదు కుటుంబాలు ఈ కుట్రకు పాల్పడుతున్నాయి. త్వరలో వారి వివరాలు బహిర్గతం చేస్తానని తేజ్ ప్రతాప్ ప్రకటించారు. 'నేను ఏ తప్పు చేయలేదు. ఎవరిమీద ఎలాంటి కుట్రలకు పాల్పడలేదు. కానీ, ఈ ఐదు కుటుంబాలు వ్యక్తిగత, రాజకీయ జీవితాన్ని నాశనం చేశాయి' అని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఈ ఏడాది చివరిలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల కోసం టీమ్ తేజ్‌ప్రతాప్‌యాదవ్ పేరుతో తన ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. అదే సమయంలో తనపై రాజకీయ కుట్ర చేస్తున్న వారిని ద్రోహులుగా పేర్కొంటూ వారిని టార్గెట్ చేస్తున్నారు. కాగా, తేజ్ ప్రతాప్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు బీహార్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆ ఐదు కుటుంబాలు ఏవో... ఆయన ఎలాంటి ఆధారాలు చూపించబోతున్నారో అన్నది ఆసక్తిగా మారింది.

పార్లమెంట్ వద్ద చొరబాటు: వ్యక్తి అరెస్టు

న్యూఢిల్లీ: పార్లమెంట్ వద్ద భద్రతాపరమైన ఉల్లంఘన జరిగింది. ఓ వ్యక్తి అక్కడి చెట్టు ఎక్కి, గోడ దూకి పార్లమెంటు ప్రాంగణంలోకి చొరబడ్డాడు. రైలు భవన్ వైపు నుంచి పార్లమెంటు కొత్త భవనం గరుడ ద్వారం వద్దకు చేరుకున్నాడు. శుక్రవారం ఉదయం 6.30 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. చొరబాటుకు యత్నించిన వ్యక్తిని అక్కడి భద్రతా సిబ్బంది గుర్తించి, వెంటనే అదుపులోకి తీసుకొని విచారించారు. పార్లమెంటు సమావేశాలు ముగిసిన మరుసటి రోజే ఇలాంటి ఘటన జరగడం గమనార్హం. 2023 డిసెంబరు 13న పార్లమెంట్‌పై ఉగ్రదాడికి 22 ఏళ్లు అయిన తరుణంలో లోక్‌సభలోకి ఇద్దరు దూసుకొచ్చిన ఘటన చోటుచేసుకోవడం అప్పట్లో కలకలం రేపింది. పబ్లిక్ గ్యాలరీ వద్ద కూర్చొన్న యువకులు సభలోకి దూకి, రంగుల పొగను వదిలి గందరగోళం సృష్టించారు. పార్లమెంట్ వెలుపల కూడా మరో ఇద్దరు ఇదే తరహా నిరసన చేపట్టారు.

దీంతో పార్లమెంట్ భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. గతేడాది ఆగస్టులోనూ ఉల్లంఘన జరిగింది. ఓ యువకుడు గోడ దూకి లోపలికి చొరబడేందుకు యత్నించాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనీశ్‌గా పోలీసులు అతనిని గుర్తించారు. అతడి మానసిక స్థితి సరిగా లేదని అప్పట్లో పోలీసులు వెల్లడించారు. తాజా చొరబాటుదారుడు కూడా ఉత్తరప్రదేశ్‌కు చెందిన రామ (20)గా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. మానసిక పరిస్థితి సరిగాలేదని తొలుత భావిస్తున్నారు కానీ ఈ పని ఎందుకు చేసివుంటాడని ఆరా తీసేందుకు ఐబీ, ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం రంగంలోకి దిగింది. నిందితుడిని ప్రశ్నించింది.

బెంగాల్ ఖైదీలపై ఏఐ నిఘా

కోల్‌కతా: నేరగాళ్లపై నిఘా కోసం కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత కెమెరాలు ఏర్పాటు చేసేందుకు బెంగాల్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇటీవల బెంగాల్‌లోని పరివర్తన కేంద్రాల్లో శిక్ష అనుభవిస్తున్న కరడుగట్టిన నేరగాళ్లు బయట జరిగే నేరాలకు జైళ్ల నుంచి వ్యూహాలు రచించడం, గంజాయి అక్రమ రవాణా, బెదిరింపులు, హత్యలు వంటి నేరాలకు ప్రణాళికలు చేస్తుండటంతో జైలు కేంద్రాలు నేరాలకు నిలయాలుగా మారాయన్నారు.

చట్టవిరుద్ధ కార్యకలాపాలను అడ్డుకునేందుకు ఏఐ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారి తెలిపారు. బెంగాల్ వ్యాప్తంగా 60 పరివర్తన కేంద్రాల్లో అత్యాధునిక కెమెరాలు ఉన్నప్పటికీ ఖైదీలు తమ దృష్టి నుంచి తప్పించుకుంటున్నారని, అందువల్లే ఏఐతో కెమెరాలు అనుసంధానిస్తున్నామని అన్నారు. ప్రతి ఖైదీ బయోమెట్రిక్ వివరాలను ఇందులో పొందుపరుస్తామన్నారు. ఇవి సాధారణ కెమెరాల్లా రికార్డు అవడమే కాక జైలు లోపల అనుమానాస్పద కదలికలు, తగాదాలు, విధ్వంసం, తప్పించుకునే ప్రయత్నాలు వంటివాటిని గుర్తించి వెంటనే జైలు గార్డులను అప్రమత్తం చేస్తాయని తెలిపారు. ముఖగుర్తింపు ద్వారా భోజన సమయాల్లో, హాజరు తీసుకునే సమయంలో గైర్హాజరైన వారిని, పారిపోవడానికి ప్రయత్నించిన వారిని ట్రాక్ చేసి అధికారులను అప్రమత్తం చేస్తుందన్నారు. కరడుగట్టిన నేరగాళ్లు ప్రత్యేక నిఘాలో ఉంటారని తెలిపారు. ఏఐ ద్వారా జైళ్లలో సెల్‌ఫోన్లు, ఆయుధాలు, మాదకద్రవ్యాలు వంటి నిషేధిత వస్తువులను గుర్తించవచ్చని తెలిపారు. ఏఐ ఆధారిత వీడియో విశ్లేషణలు ఖైదీల ప్రవర్తన, మానసిక ఒత్తిడి, ఆత్మహత్య ధోరణులను అంచనా వేయగలవన్నారు. దీనివల్ల దిద్దుబాటు చర్యలకు అవకాశం కలుగుతుందని అధికారి చెప్పారు.

వంద ఉపన్యాసాల కంటే పాట శక్తిమంతం

- బీజేపీపై పోరాటంలో ప్రజాకళాకారులు కీలకపాత్ర
- ప్రజల ఐక్యతకు అంబేద్కర్ రాజ్యాంగం స్ఫూర్తి
- దేశ సంపద దోచుకుంటున్న మనువాదులు
- కళామహోత్సవంలో సీపీఐ నేత రామకృష్ణ

విశాలాంధ్ర-ఒంగోలు: వంద ఉపన్యాసాల కన్నా ప్రజా కళాకారుని ఒక పాట ఎంతో శక్తిమంతంగా ప్రజలను చైతన్య పరుస్తూ దూసుకుపోతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. పార్టీ వందేళ్ల పండుగను పురస్కరించుకొని నగరంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచి స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలో జరుగుతున్న 'ఒంగోలు కళా మహోత్సవం' శుక్రవారం మూడవ రోజుకు చేరుకుంది. సభాధ్యక్షుడిగా ప్రజానాట్యమండలి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.రామకృష్ణ వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామకృష్ణ మాట్లాడుతూ... దేశం నేడు క్లిష్ట పరిస్థితుల్లో ఉందన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా వివిధ మతాలు, కులాలు, భాషలు ఉన్నాయన్నారు. ఇన్ని రకాల ప్రజలను ఐక్యంగా ఉంచడంలో అంబేద్కర్ రచించిన లౌకిక రాజ్యాంగం గొప్ప స్ఫూర్తితో నిలిచింది అన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన మనువాదులు రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ దేశ సంపదను దోచుకుంటూ, ప్రజల మధ్య కులమతాల చిచ్చులు పెడుతూ పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీపై వామపక్ష పార్టీలు సాగిస్తున్న పోరాటంలో ప్రజా కళాకారులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రజలను చైతన్యవంతం చేస్తూ పాలకుల అవినీతి భాగోతాలను ఎండ కట్టాలని కోరారు. వెయ్యి మంది కళాకారులు వందలాది కళారూపాలతో పాల్గొనటం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది అన్నారు. మరో ముఖ్యఅతిథి సినీ హీరో మాదాల రవి మాట్లాడుతూ దేశంలో జాతీయ... ప్రాంతీయ పార్టీలు అనేకం ఉన్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అన్నారు. దేశంలో అన్ని కమ్యూనిస్టు పార్టీలు, అభ్యుదయవాదులు ఐక్యంగా నిలిచి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఆయుధాలు కన్నా శక్తివంతమైనది ప్రజాకళ అన్నారు. ప్రపంచానికి నిజమైన హీరోలు భగత్ సింగ్, అంబేద్కర్, చేగువేరా వంటి వారిని పేర్కొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు,నల్లూరి వెంకటేశ్వర్లు శిష్యులు మాదాల రంగారావు, టి. కృష్ణ, వందేమాతరం శ్రీనివాస్, దర్శకులు బాబ్జి ... సినీ రంగాన్ని ఆకాశం నుంచి నేలకు దించిన వారే అని గుర్తు చేశారు. బాబ్జి మాట్లాడుతూ తాము ఇంత గొప్ప స్థాయిలో ఉన్నామంటే దానికి కారణం ఏపీ ప్రజానాట్యమండలి అని గుర్తు చేశారు. ప్రజా వాగ్గేయకారులు గోరేటి వెంకన్న, ఏపూరి సోమన్న ఆట, పాట, మాట ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రనాయక్, చిన్నం పెంచలయ్య, నాగరాజు, పిచ్చయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళారూపాలు... ఉర్రూతలూగించిన 'గోరేటి' పాటలు

కళాకారులు ప్రదర్శించిన కళా రూపాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పేదలదే ఎర్రజెండా రా... సీపీఐ ఎర్రజెండారా, నిండు అమాస నాడు ఓ లచ్చ గుమ్మడి, కమ్యూనిజం పిలుస్తుంది కదలిరా సోదరా, ఎర్రని జెండమ్మ మా ఎర్రని జెండా అమ్మ, ఏం ప్రజా కళాకారులం ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి మేమందరం, ఓ వందేళ్ల చరిత్ర ఎర్ర జెండా మనదేరా, గగన కాంతిలో ఎర్రగా వంటి పాటలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. తిరుపతి కళాకారుల పల్లె పల్లె ఎగరవే ఎర్రజెండా, యువతరం శివమెత్తితే, కర్నూలు జిల్లా కళాకారుల చెట్టు పేరు చెప్పి, పాడవోయి భారతీయుడా, అజేయం ఈ కమ్యూనిజం వంటి పాటలకు చేసిన నృత్యాలు ప్రేక్షకుల చేత ఈలలు వేయించాయి. సుబ్బన్న ఫ్లూటు వాయిద్యంపై పాడిన ఎర్రజెండా గుండెల్లోన ఒదిగిన వాళ్ల రా పాట ప్రత్యేక ఆకర్షణగా నిలబడింది. అలాగే ప్రజా వాగ్గేయకారులు గోరేటి వెంకన్న, సోమన్నల పాటలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.

సీపీఐ రాష్ట్ర మహాసభలకు భూరీ విరాళాలు



మద్దిపాడు: సరోజ్ సేవా ఫౌండేషన్ ఆసరా అధ్వర్యంలో ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం మారెళ్లగుంటపాలెం ఆసరా కేంద్రం వృద్ధాశ్రమంలో నిర్మించిన నూతన గదులను ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) ప్రారంభించారు. ఈ సందర్భంగా లైబ్రరీలో జరిగిన సభలో ఆసరా కార్యవర్గ సభ్యుడు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ గడ్డం కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆసరా కేంద్రాన్ని నిర్మించడానికి చిడిపోతు వెంకటేశ్వర్లు ఇచ్చిన భారీ విరాళం ఉత్సాహం నింపిందని, దానితో అందరం కలిసి మరికొంత విరాళం సేకరించి వృద్ధాశ్రమం నిర్మించామని చెప్పారు. పుత్తూరి పేరయ్య కుటుంబం ఇచ్చిన సహాయంతో కమ్యూనిటీ హాల్ నిర్మించినట్లు తెలిపారు. ఆగస్టు 23, 24, 25 తేదీలలో ఒంగోలులో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలకు ఆసరా అధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు రూ.50 వేలు, పోతినేని శ్రీనివాసరావు రూ.50 వేల భూరీ విరాళాలు అందజేశారు. ఈ మొత్తాన్ని నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), మహాసభల నిర్వహణ కోశాధికారి కొత్తకోట వెంకటేశ్వర్లుకు అందజేశారు. వడ్డేల సింగయ్య రూ.20 వేలు, ఎన్.బాలసుబ్రమణ్యం రూ.10 వేలు, ఎంసీ వెంకటేశ్వర్లు రూ.10 వేలు, ఎన్.బ్రహ్మానందం రూ.5 వేలు, మన్నే సుబ్బారావు రూ.5 వేలు, మండ రంగారావు రూ.5 వేలు, సీపీఐ నాయకులు టీవీ శేషయ్య రూ.5 వేలు, నల్లజర్ల రంగారావు(విజయవాడ) రూ.5 వేల విరాళాలు అందజేశారు. ఎన్.బ్రహ్మానందం, నల్లజర్ల రంగారావు, ఎంసీ వెంకటేశ్వర్లు, వి.సింగయ్య తదితరులు మాట్లాడారు. సీపీఐ జిల్లా నాయకులు ఉప్పుటూరు ప్రకాశరావు, మండల, గ్రామ నాయకులు పావులూరి అంజయ్య, రామకోటయ్య, ఎన్.శ్రీనివాసరావు, నల్లూరి రామారావు, అంగలకుర్తి వెంకట్రావు, ముప్పరాజు అన్నపూర్ణ తదితరులు హాజరయ్యారు. గదుల నిర్మాణానికి సహాయం చేసిన దాతలకు ఆసరా సరోజ్ సేవా ఫౌండేషన్ తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

వీఆర్వోలపై ఒత్తిడి తగదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సుమోటో ధ్రువీకరణ పత్రాల విషయంలో వీఆర్వోలపై అధికారులు ఒత్తిడి చేయడం సరికాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. గత ప్రభుత్వంలో 2024 ఎన్నికల ముందు ఇదే సుమోటో ధ్రువీకరణ పత్రాల విషయంలో లక్షలాది ధ్రువీకరణ పత్రాలను వీఆర్వో లాగిన్‌లోకి సరైన వివరాలు లేకుండా, తండ్రి పేరు లేకుండా డోర్ నెంబర్ లేకుండా, కేవలం పేర్లు మాత్రమే పంపించి వారి తాలూకా వివరాలు సేకరించి..వారి దగ్గర ఉన్న ఆధారాలు తీసుకుని సుమోటో ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని పేర్కొన్నారు.

సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శిగా

కోనాల భీమారావు

విశాలాంధ్ర-తణుకు: సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శిగా కోనాల భీమారావు రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తణుకులో రెండు రోజుల పాటు జరిగిన సీపీఐ జిల్లా మహాసభల్లో పార్టీ జిల్లా కార్యదర్శిగా తనతో పాటు తొమ్మిది మందితో జిల్లా కార్యవర్గం, 31 మందితో జిల్లా సమితి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు భీమారావు శుక్రవారం చెప్పారు. కార్యవర్గ సభ్యులుగా కలిశెట్టి వెంకట్రావు, బొద్దాని నాగరాజు, సికిలే పుష్పకుమారి, ఎం.సీతారాంప్రసాద్, సీహెచ్ రంగారావు, నెక్కంటి క్రాంతికుమార్, సనపల శ్రీనివాస్, మండల నాగేశ్వరరావు ఎన్నికయ్యారని వివరించారు. సుదీర్ఘకాలంగా ఎన్నికలు లేకుండా ప్రత్యేకాధికారుల పాలనలో మగ్గుతున్న తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, భీమవరం మునిసిపాలిటీలలో ఉన్న అవాంతరాలను తొలగించి త్వరితగతిన ఎన్నికలు నిర్వహించాలని, జిల్లాలో రైతులు, కౌలు రైతులు, ఆక్వా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, రైతాంగం పండించే పంటలకు కనీస మద్దతు ధర లభించేందుకు ఉద్యమించాలని మహాసభల్లో తీర్మానించినట్టు భీమారావు చెప్పారు.

ప్రజా కళలతోనే సామాజిక మార్పు

- విలువలతో కూడిన సాహిత్యానికి ఎదురు లేదు: గోరేటి వెంకన్న
- కళారూపాలే ఆయుధాలుగా సీపీఐ ఉద్యమాలు: గుజ్జుల ఈశ్వరయ్య

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు: అక్షరాన్ని నిషేధించే దమ్ము ఎవరికీ లేదని, ప్రజా సాహిత్యాన్ని నిషేధిస్తే ఆగుతుందా అని ప్రజా వాగ్గేయకారుడు, కవి, రచయిత, గాయకుడు గోరేటి వెంకన్న అన్నారు. ప్రజా కళలతోనే సమాజంలో మార్పు రాగలదని చెప్పారు. విలువలతో కూడిన సాహిత్యానికి ఎదురు ఉండదని, నిజమైన కళలకు ఆదరణ తగ్గదని అన్నారు. సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూమ్ హాలులో ఏపీ ప్రజానాట్యమండలి అధ్వర్యంలో కళా మహోత్సవానికి గోరేటి వెంకన్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎంసీపీ హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళలు, సాంకేతికత, పెట్టుబడి కలవకూడదన్నారు. ప్రజలను భయపెట్టడం కోసం, వ్యసనపరులుగా మార్చడం కోసం, మానవ స్వభావంలోని వికృతత్వాన్ని పెంచడం కోసం వీటిని వినియోగిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. నేటి సినిమా వికృతం, భయానకం, రాచరికంతో కూడిన హింసా సంస్కృతిని పెంచిదిగా ఉందన్నారు. సినీ రంగంలో తమన్ బోస్, సత్యజిత్ రే, హృతిక్ ఘటక్ వంటి గొప్ప కళాకారులు, దర్శకులు ఉన్నారని గుర్తుచేశారు. ప్రజా కళలకు, జానపదాలకు, పౌరాణిక సాహిత్యానికి ఆదరణ తగ్గలేదన్నారు. చీమకుర్తి నాగేశ్వరరావు, రజనీ భాయ్, ఏవీ సుబ్బారావు వంటి వారి కళలకు నేటికీ ప్రాచుర్యం ఉందని అన్నారు. విలువలతో కూడిన, మంచి సాహిత్యం కలిగిన, ప్రజలను చైతన్య పరిచే కళలను ప్రజలు ఆదరిస్తారన్నారు. అన్నమాచార్యులు, త్యాగయ్య, మంగళపల్లి బాలమురళీకృష్ణ వంటి వారి సాహిత్యానికి ఆదరణ కొనసాగుతుందని చెప్పారు. నిషేధించిన పుస్తకాలు మరింతగా ఆదారణ పొందుతాయన్నారు. 'ఇటీవల కాలంలో వచ్చిన 'రాను బొంబాయికి రాను' జానపద గీతం కోట్ల మంది ఆదరణ పొందింది. 'గల్లీ చిన్నది, ఏం పిల్లడో వెళ్దాం వస్తావా, పల్లె కన్నీరు పెడుతుందో' వంటి విలువైన సాహిత్యం కలిగిన పాటలకు ప్రజాదరణ తగ్గలేదు. ఎవరు ఎన్ని వాయిద్యాలు వాయించినా ఫ్లూటు మాధుర్యాన్ని తొలగించగలరా? సన్నాయిలో ఉండే కళా ఆసక్తిని తగ్గించగలరా?' అని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్సీగా ఉన్నప్పటికీ ఎర్రజెండా బిడ్డనేనని చెప్పుకున్నారు. పేదల పక్షాన చట్టసభలలో గళం వినిపిస్తానంటూ గోరేటి వెంకన్న తెలిపారు. సీపీఐ రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు.

నేడు మహా ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ:

కళారూపాలను ఆయుధంగా చేసుకొని సీపీఐ అనేక ఉద్యమాలు నిర్వహించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో యాదగిరి పాడిన బండెనక బండి కట్టి, 16 బండ్లు కట్టి వంటి పాటలు ప్రజలను ఉద్యమంలో భాగస్వామ్యం చేశాయన్నారు. అభ్యుదయ గీతాలతో, చైతన్యపరిచే నాటికలతో, స్ఫూర్తిదాయకంగా నిలిచే నృత్యాలతో కళా ప్రదర్శనలతో కళా మహోత్సవానికి మంచి స్పందన వస్తుందని అన్నారు. మహాసభలను పురస్కరించుకొని శనివారం భారీ ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతాయని, వెయ్యి మంది కళాకారులు, 100 గొంతుకుల నినాదంతో కార్యక్రమాలు జరుగుతాయని ఈశ్వరయ్య చెప్పారు. బహిరంగ సభకు సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి కె.నారాయణ, ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతున్నారని ఈశ్వరయ్య తెలిపారు. మీడియా సమావేశంలో ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష-ప్రధాన కార్యదర్శులు చంద్ర నాయక్, చిన్నం పెంచలయ్య, నిర్వాహక కార్యదర్శి రామకృష్ణ, పాట వెంకన్న, శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇక ఏటా డీఎస్సీ

- విద్యాశాఖలో సమర్థంగా సంస్కరణలు
- అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణం
- మంత్రి లోకేశ్ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించి... విజయవంతంగా నిర్వహించామని, ఇకపై ఏటా డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేయనున్నట్లు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఉండవల్లి నివాసంలో విద్యాశాఖపై రాష్ట్రస్థాయి అధికారులతో శుక్రవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. అనవసర శిక్షణా కార్యక్రమాలతో ఉపాధ్యాయుల విలువైన సమయాన్ని వృథా చేయొద్దని, ప్రభుత్వ విద్యలో విద్యాప్రమాణాల మెరుగునకు 14నెలలుగా సమర్థవంతంగా సంస్కరణలు అమలుచేశామని తెలిపారు. సంస్కరణల అంతిమ లక్ష్యం అభ్యసన ఫలితాలేనని, మెరుగైన ఫలితాలపై దృష్టిసారించాల్సిన బాధ్యత అధికారులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. తల్లికి వందనం పకడ్బందీగా అమలుచేశామని, ...చివరి విడతగా పెండింగ్ దరఖాస్తులను ఆమోదిస్తూ రూ.325కోట్లు విడుదల చేశామని వివరించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 2024-2025 ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్ణీత క్యాలెండర్ ప్రకారం మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో సైన్స్, స్పోర్ట్స్ ఫేర్‌లు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో కీలక మౌలిక సదుపాయాల అభివృద్ధికి దేశ, విదేశాల్లో స్థిరపడిన ప్రముఖులు, దాతల సహకారం తీసుకోవాలని కోరారు. అనంతపురం, నెల్లూరు, ఏలూరు, కడప చిత్తూరులో ఆధునీకరించిన సైన్స్ సెంటర్లను త్వరగా ప్రారంభించి... విద్యార్థులకు ఉపయోగకరంగా తీర్చిదిద్దాలని, రాష్ట్రవ్యాప్తంగా మంజూరైన 125 ఆటిజం సెంటర్ల నిర్మాణ పనులు సత్వరమే ప్రారంభించాలన్నారు. దేశంలోనే అత్యుత్తమ మోడల్‌తో అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణాన్ని చేపట్టాలని, 2లక్షల చదరపు అడుగుల్లో డిజైన్ చేస్తున్న ఈ లైబ్రరీ నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విశాఖపట్నం జగదాంబ సెంటర్‌లో ప్రాంతీయ గ్రంథాలయాన్ని 50వేల అడుగుల్లో నిర్మించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సిందిగా మంత్రి లోకేశ్ ఆదేశించారు. ఉమ్మడిజిల్లా కేంద్రాల్లో ప్రస్తుతం 13మాత్రమే జిల్లా గ్రంథాలయాలు ఉన్నాయని, వాటితో పాటు కొత్తగా ఏర్పాటైన జిల్లా కేంద్రాల్లోను జిల్లా గ్రంథాలయాలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక సంస్థల నుంచి దాదాపు రూ.213 కోట్ల మేర సెస్సు బకాయిలు రాబట్టి లైబ్రరీలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు, ఇంటర్ విద్య కమిషనర్ కృతికా శుక్లా, సర్వశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ సంచాలకులు బి.శ్రీనివాసరావు, విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ సీఎన్ దీవెన్‌రెడ్డి, పబ్లిక్ లైబ్రరీస్ డైరక్టర్ కృష్ణమోహన్ రావు పాల్గొన్నారు.

పోర్టల్ డెమో పరిశీలన: ఉండవల్లి నివాసంలో నైపుణ్య విభాగం అధికారులతో మంత్రి నారా లోకేశ్ సమీక్ష నిర్వహించారు. నైపుణ్యం పోర్టల్‌ను మెరుగ్గా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం యువత, పరిశ్రమలను అనుసంధానించేలా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకురానున్న నైపుణ్యం పోర్టల్‌ను దేశానికే రోల్ మోడల్‌గా నిలిచేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగం కార్యదర్శి కోన శశిధర్, సీఈవో జి.గణేశ్ కుమార్, ఏపీఎస్ఎస్ డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.రఘు, ఏపీఎస్ఎస్ డీసీ అసోసియేట్ డైరెక్టర్ కుమార పురుషోత్తం, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృతికా శుక్లా పాల్గొన్నారు.

జర్నలిస్టులపై వేధింపులు దుర్మార్గం: రాజా



న్యూఢిల్లీ: ఇండిపెండెంట్ జర్నలిస్టులు సిద్ధార్థ వరదరాజన్, కరణ్ థాపర్ (ది వైర్), అభిసార్ శర్మలను వేధింపులకు గురిచేసే ఉద్దేశంతో గువహతిలో బీజేపీ కార్యకర్త ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా శుక్రవారం మీడియా ప్రకటనను విడుదల చేశారు. పాలక పక్షాలు, వాటి విధానాల పట్ల విమర్శనాత్మకంగా వ్యవహరించే గొంతులు నొక్కేందుకు ప్రజాస్వామ్య చట్ట పుస్తకాలలో స్థానం లేని నిరంకుశ నిబంధనలు ప్రయోగించడం అస్సాం వంటి బీజేపీ పాలిత రాష్ట్రాలలో ప్రమాదకర విధానంగా మారిందని ఆయన విమర్శించారు. బీహార్‌లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ఊబిలో కూరుకుపోయి, ఓట్ల చోరీ ఆరోపణలు, ఇబ్బందికర పరిస్థితులలో ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్కర్ రాజీనామా వంటి అంశాలతో బీజేపీ సతమతమవుతోందన్నారు. వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు, అసమ్మతిని అణిచివేసే ఎత్తుగడలకు బీజేపీ పాల్పడుతోందని రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యతిరేక రాజ్యాంగ 130వ సవరణ నుండి జర్నలిస్టులపై రాజద్రోహం అభియోగాలు మోపడం వరకు బీజేపీ తన ఫాసిస్టు పోకడలను విస్తరిస్తోందని ఆయన విమర్శించారు.

సమాజంలో నేటికీ అంటరానితనం

అబద్ధాల చక్రవర్తి పుస్తకావిష్కరణలో రామకృష్ణ

విశాలాంధ్ర-ఒంగోలు బ్యూరో: సమాజంలో నేటికీ అంటరానితనం కొనసాగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. పీవీఆర్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న మూడవ పుస్తక మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దేవరాజు మహారాజు రచించిన 'హిందుత్వ సింహాసనంపై అబద్ధాల చక్రవర్తి' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నేడు సమాజంలో ఇంకా కులం, మతం అన్న పేరుతో విభజన రేఖ ఉందని అన్నారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం త్వరలో మనం జపాన్‌ను అధిగమిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, జనబాహుళ్యంలో మనతో సమానంగా ఉన్న చైనాతో మనం పోల్చుకోవాలని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి అప్పటి వరకు ప్రధాన మంత్రులుగా కొనసాగిన వారు రూ.60 లక్షల కోట్లు అప్పు చేస్తే... మోదీ ప్రధానిగా 11 ఏళ్ల కాలంలో 140 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేశారని విమర్శించారు. ప్రస్తుతం దేశంలో మతోన్మాద శక్తులు విజృంభిస్తున్నాయని ధ్వజమెత్తారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణమూర్తి ఈ కార్యక్రమంలో వివిన మూర్తి రచించిన 'వాడు-నేను' అనే పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సభకు అధ్యక్షత వహించిన విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ గడ్డం కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో ఇప్పటికీ ఆర్థిక అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. నిరుద్యోగం, పేదరికం నిర్మూలించామని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆర్థిక వ్యత్యాసాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పుస్తక ప్రదర్శన అధ్యక్ష, కార్యదర్శులు కె.లక్ష్మయ్య, మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భారత రోలర్ స్కేటర్లకు ప్రోత్సాహం

బెంగళూరు: భారత్‌కు చెందిన రోలర్ స్కేటర్లలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించే ప్రయత్నాన్ని ఆస్ట్రేలియన్ హై కమిషన్ చేసింది. ప్రతిష్ఠాత్మక వరల్డ్ స్టేట్ పసిఫిక్ కప్ క్లబ్ కాంపిటీషన్- 2025లో పాల్గొనే క్రీడాకారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. ఆస్ట్రేలియా, క్వీన్స్‌ల్యాండ్‌లోగల మౌంట్ వార్నర్‌లో ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయి. రోలర్ స్కేటర్లతో మాటామంతి బెంగళూరులో ఆస్ట్రేలియా హై కమిషన్ అధ్వర్యంలో నిర్వహించారు. క్రీడా దౌత్యం, సంస్కృతి సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమం జరిగింది. ఆస్ట్రేలియా వాణిజ్యం, పెట్టుబడుల కమిషనర్ విక్ సింగ్, సీనియర్ డైరెక్టర్ సంగీత కృష్ణమూర్తి, డైరెక్టర్ రామకృష్ణ దస్త్రాల, ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్ హారియట్ వైట్ పాల్గొన్నారు. ఆస్ట్రేలియా-భారత్ సంబంధాల్లో క్రీడా వ్యవస్థ బలోపేతాన్ని పునరుద్ఘాటిస్తూ, అథ్లెట్ల మనోబలాన్ని పెంచుతూ, వారిని ఉత్తేజపరుస్తూ, క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చేలా అధికారులు మాట్లాడారు. భారత స్కేటర్లు పెడిరెడ్ల చైత్ర దీపికా, వఛ్లాని హృతిక్, అర్జున అవార్డు గ్రహీత అనుప్ కుమార్ యమ (అంతర్జాతీయ స్కేటింగ్ చాంపియన్) సంభాషణలో పాల్గొన్నారు. భారత్ కోసం పతకాలు సాధించాలనే లక్ష్యంతో పోటీల్లో పాల్గొనేందుకు ఉత్సాహంగా ఉన్నట్లు యువ అథ్లెట్లు చెప్పారు. అనుప్ కుమార్ తన అనుభవాలను పంచుకున్నారు. ఆస్ట్రేలియా అతిథ్యం, అక్కడి వైవిధ్య రుచులు, వన్యజీవులు, ప్రకృతి అందాలు, సాంస్కృతిక అనుభవాల గురించి అధికారులు వర్ణించారు.

ఓట్ల చోరీతోనే బీజేపీ మనుగడ

ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేయలేరు: ప్రజల గొంతు నొక్కేయలేరు

ఓటరు అధికార్ ర్యాలీలో సీపీఐ కార్యదర్శి గిరీశ్

భాగల్పూర్: బీహార్‌లో సాగుతున్న ఓటరు అధికార్ ర్యాలీలకి ప్రజాదరణ లభిస్తోంది. నిత్యం ఇండియా నాయకుల ప్రదర్శనలో పాల్గొంటుండగా, వారి వెంట వందల సంఖ్యలో కార్యకర్తలు నడుస్తున్నారు. శుక్రవారం యాత్రలో సీపీఐ తరపున జాతీయ కార్యదర్శి డాక్టర్ గిరీశ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఓట్లు దొంగలించి బీజేపీ మనుగడ సాగిస్తోందని దేశ ప్రజలకు స్పష్టమైందన్నారు. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో అందరి కళ్ల ఎదుట ఓట్ల చోరీ జరిగిందని, ప్రజాస్వామ్యాన్ని ఏ విధంగా అణచివేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేయలేరని, ప్రజల గొంతు నొక్కేయలేరన్నారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రజల ఓటు హక్కును పరిరక్షించడం కోసమే ఓటరు అధికార్ యాత్రలో సీపీఐ పాల్గొంటోందన్నారు. ఓట్ల చోరీ వ్యవహారంలో బీహార్ ప్రజలకు సీపీఐ సంపూర్ణ మద్దతిస్తోందని గిరీశ్ ప్రకటించారు. బీహార్‌కు సంఘీభావంగా సెప్టెంబరు 1న ఉత్తరప్రదేశ్‌లోని 75 జిల్లాల్లో ఆందోళనలు జరుగుతాయని తెలిపారు. ప్రజల గొంతు మూగబోదన్నారు. ఎన్నికల జాబితాల్లో అవకతవకలను తీవ్రంగా ఖండిస్తోందని గిరీశ్ వెల్లడించారు. ఓటరు అధికార్ యాత్ర ప్రతి దశలోనూ సీపీఐ భాగస్వామిగా ఉంటుందన్నారు. సెప్టెంబరు 1న జరగబోయే ర్యాలీలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పాల్గొంటారని చెప్పారు. 'ఇది కేవలం మార్చ్ కాదు, నిరంకుశత్వానికి ప్రజల ప్రతిఘటన' అని గిరీశ్ వక్కాణించారు. కలిసికట్టుగా రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దామంటూ ఆయన పిలుపునిచ్చారు. యాత్రలో గిరీశ్‌తో పాటు ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్, సీపీఐ ఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఐఎన్‌సీ బీహార్ అధ్యక్షుడు రాకేశ్ రామ్, వీఐపీ నేత ముకేశ్ సహని పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 32299/79, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.